పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :296 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి ఆదివారం 1 నవంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :296 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : TIRUPATI SUN 1 NOVEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది.. రాప్తాడు ఘటనే నిదర్శనం

- రాప్తాడు పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై కిరాతక దాడి
- టీడీపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయన్న మాజీ సీఎం జగన్
- ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ
- బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఘటనపై విస్తృత దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు

- మిగతా 2లో

ఆ 53 రోజుల అక్రమ నిర్బంధంపై కోట్లాది ప్రజల స్పందనను ఎప్పటికీ మరువను

- రాజమండ్రి జైలు నుంచి విడుదలై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పోస్ట్
- నాటి మద్దతు జీవితంలో మర్చిపోలేనని చంద్రబాబు భావోద్వేగం
- ప్రజల సహకారంతో 2047 నాటికి తెలుగు జాతిని నెం.1 చేస్తానని ప్రతిజ్ఞ

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వ హయాంలో తాను 53 రోజుల అక్రమ నిర్బంధాన్ని ఎదుర్కొన్నానని, ఆ సమయంలో తనకు అండగా నిలిచిన కోట్లాది ప్రజల మద్దతును జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని

- మిగతా 2లో

ఏపీ మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం..

నేడు పోలింగ్!

- ఆంధ్రప్రదేశ్‌లో పుర, నగర పాలక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- 36,351 మంది పోలీసులతో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బందోబస్తు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు లేదా వెబ్‌కాస్టింగ్
- దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు
- ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఈసీ పిలుపు

ప్రతి పోలింగ్ కేంద్రంపై కెమెరా నీడ!

ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ పునేఠా వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశంలో పూర్తి వివరాలు అందించారు.

36 వేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రత

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా స్థానిక ఎన్నికల కోసం 36,351 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్‌గా వర్గీకరించారు. హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో 1+4 (ఒక అధికారి, నలుగురు సిబ్బంది), సెన్సిటివ్ కేంద్రాల్లో 1౦3 పద్ధతిలో భద్రత కల్పిస్తున్నారు.

- మిగతా 2లో

స్కూల్‌లో దారుణం..

పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో పాశవిక దాడి!

- రాప్తాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘటన
- పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి
- బాలిక ముఖం, తల, వీపుపై తీవ్ర గాయాలు
- అడ్డుకునేందుకు వెళ్లిన మరో విద్యార్థినికి గాయాలు
- బాలికను ఆసుపత్రికి తరలించి చికిత్స

అనంతపురం జిల్లాలోని రాప్తాడు మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ వ్యక్తి చెట్లను కోసే ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో చాలా తీవ్రమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు.పాఠశాలలోకి వచ్చిన నిందితుడు విద్యార్థినిపై ఒక్కసారిగా దాడికి పాల్పడినట్లు సమాచారం.

- మిగతా 2లో

చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు

- రాప్తాడులో బాలికపై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి లోకేశ్
- ఆడపిల్లల భద్రతకు భంగం కలిగిస్తే ఉక్కుపాదంతో అణిచేస్తామని హెచ్చరిక
- పాఠశాల తరగతి గదిలో విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన ఉన్మాది
- ధర్మవరం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనపై సీఎం చంద్రబాబు, మంత్రులు దిగ్భ్రాంతి, కఠిన చర్యలకు ఆదేశాలు

- మిగతా 2లో

ఏపీకి మరో తుపాను గండం..

నెల్లూరు-నరసాపురం మధ్య తీరం దాటనున్న తీవ్ర తుపాను!

- బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం
- నవంబర్ 2 నాటికి తీవ్ర తుపానుగా మారే సూచన
- నెల్లూరు - నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందన్న ఐఎండీ
- గంటకు 120 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా

పెన్ పవర్ డెస్క్:ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వేగంగా బలపడుతోంది. ఇది రేపటికి తుపానుగా, ఆపై తీవ్ర తుపానుగా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకురానుంది. ఈ తుపాను నవంబర్ 3వ తేదీ ఉదయం నెల్లూరు,

- మిగతా 2లో

ఖైబర్ పఖ్తుంఖ్వాపై పాక్ సైన్యం కన్ను.. ఖనిజ సంపదే లక్ష్యమా?

- పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతంపై ఆందోళన 2లో
- ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎమర్జెన్సీ విధింపు
- ప్రావిన్స్ ఖనిజ సంపదను చేజిక్కించుకునేందుకే ఈ చర్యలని అనుమానాలు
- ఈ చర్యలతో తీవ్రవాదానికి ఆయుధం ఇచ్చినట్లవుతుందని హెచ్చరించిన నివేదిక

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం.. ఫ్యాక్టరీలో నలుగురు సజీవ దహనం

- ఢిల్లీలోని మంగోల్పురిలో ఘటన
- చెప్పుల ఫ్యాక్టరీలో చెలరేగిన మంటల్లో నలుగురు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఆరుగురిని కాపాడిన సిబ్బంది
- రబ్బరు కారణంగా మంటలు వేగంగా వ్యాపించాయని అంచనా
- ప్రమాద కారణాలపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం

- మిగతా 2లో

దేశ యువత మిమ్మల్ని క్షమించదు

పెన్ పవర్ డెస్క్: ఓట్లను కొల్లగొట్టేందుకు కుట్రపన్నే వారిని లక్ష్యంగా చేసుకొని ప్రజా అభిశంసన కార్యక్రమం చేపట్టామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ద పేర్కొన్నారు. ఎన్నికల ప్రధాన అధికారిపై కేసు పెట్టి న్యాయస్థానంలో విచారణ జరపాలన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెట్టిన అభిశంసన తీర్మానానికి మద్దతు పలికిన ఆయన.. విపక్ష నేతలంతా పచ్చిక బయళ్లలో

- మిగతా 2లో



దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు.. వారి కుట్రలను భగ్నం చేయాలి

పెన్ పవర్ డెస్క్: దేశాభివృద్ధి దిశగా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని, ఈ ప్రయాణాన్ని అడ్డుకోవాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ పురోగతికి ఆటంకాలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 31న గుజరాత్‌లోని

- మిగతా 2లో

రెస్క్యూ మిషన్ విఫలం.. భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్

పెన్ పవర్ డెస్క్: దాదాపు 22 ఏళ్లుగా అంతరిక్షంలో సేవలందిస్తున్న నాసాకు చెందిన 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' అనే భారీ టెలిస్కోప్ త్వరలో భూమిపై కూలిపోనుంది. ఈ టెలిస్కోప్ రెస్క్యూ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో.. అది అంతకంతకూ కిందికి దిగుతూ..

- మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

ఆ 53 రోజుల అక్రమ నిర్బంధంపై

కోట్లాది ప్రజల స్పందనను ఎప్పటికీ మరువను

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్వేగభరితంగా పేర్కొన్నారు. సరిగ్గా మూడేళ్ల క్రితం ఇదే రోజున (అక్టోబర్ 31) రాజమండ్రి జైలు నుంచి విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన శనివారం ఒక సుదీర్ఘమైన, భావోద్వేగభరితమైన సందేశాన్ని పంచుకున్నారు. తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆ 53 రోజులే అత్యంత కఠినమైనవని ఆయన అభివర్ణించారు.

అర్ధరాత్రి అరెస్టు ఒక కుట్ర

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకుంటూ, "నాడు విధ్వంస పాలనను ప్రశ్నిస్తుంటే సహించలేని పాలకులు, ప్రజలను, ప్రతిపక్షాలను అణచివేయాలని చూశారు. అందులో భాగంగానే నంద్యాలలో కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను అర్ధరాత్రి అన్యాయంగా అరెస్టు చేశారు. అది కుట్రపూరిత అరెస్టు, అక్రమ నిర్బంధం అని అందరికీ తెలుసు" అని చంద్రబాబు ఆరోపించారు. నిర్బంధంతో తనను ఒంటరిని చేయాలనుకున్న కుట్రలు, యావత్ తెలుగు జాతి తిరుగుబాటుతో బద్దలయ్యాయని ఆయన అన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో మళ్లీ ప్రజల్లోకి వచ్చానని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన మద్దతు

తాను జైల్లో ఉన్నప్పుడు రాష్ట్రం, దేశం అనే తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా 60కి పైగా దేశాల్లోని తెలుగువారు, ప్రజాస్వామ్యవాదులు స్వచ్ఛందంగా తనకు సంఘీభావం తెలిపారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. "పల్లెల్లో సామాన్య మహిళల నుంచి ప్రపంచస్థాయి కార్పొరేట్ కంపెనీల సీఈవోల వరకు, రైతుల నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణుల వరకు, విద్యార్థుల నుంచి ప్రవాసాంధ్రుల వరకు.. సమాజంలోని ప్రతి వర్గం నుంచి వెల్లువెత్తిన మద్దతు అపూర్వం" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, ఎంత నిర్బంధం ఉన్నా గచ్చిబౌలి స్టేడియంలో 'సీబీఎన్ గ్రాటిట్యూడ్' పేరుతో జరిగిన కార్యక్రమంలో వేలాదిగా తరలివచ్చిన యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ తన కోసం నినదించిన ఘటన జీవితాంతం గుర్తుండిపోతుందని అన్నారు.

కుటుంబ సభ్యులకు, ప్రజలకు కృతజ్ఞతలు

రాజకీయాలకు ఎప్పుడూ దూరంగా ఉండే తన అర్ధాంగి, కుటుంబ సభ్యులు సైతం 'నిజం గెలవాలి' అంటూ ప్రజల వద్దకు వస్తే, వారితో కలిసి ప్రజలు అడుగు వేసి నిజాన్ని గెలిపించారని చంద్రబాబు అన్నారు. ఆ కష్టకాలంలో తనకు మద్దతు పలికిన ప్రతి పౌరుడికి, కార్యకర్తకు, అభిమానికి, ప్రజాస్వామ్యవాదికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. "నాడు నా కష్టాన్ని తమ కష్టంగా భావించి స్పందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మీ ప్రేమను, అభిమానాన్ని, నమ్మకాన్ని నా జీవితాంతం నిలబెట్టుకుంటాను. నా కోసం నిలిచిన మీ కోసం చివరి వరకు నిలబడతాను" అని ఆయన హామీ ఇచ్చారు.

మీ భవిష్యత్తే నా సంకల్పం

ప్రజల నమ్మకం, అభిమానమే తన బలమని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వారి భవిష్యత్తే తన సంకల్పమని స్పష్టం చేశారు. ప్రజలందరి మద్దతు, సహకారం, భాగస్వామ్యంతో 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ 1 స్థానంలో నిలబెడతానని ప్రతిజ్ఞ చేశారు.

ఏపీకి మరో తుపాను గండం..

- మొదటి పేజీ తరువాయి

నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకొచ్చని హెచ్చరించింది.ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్ నికోబార్ దీవులకు సమీపంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వాయుగుండం, గత 6 గంటల్లో గంటకు 30 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఈ (అక్టోబర్ 31) అర్ధరాత్రికి ఇది తీవ్ర వాయుగుండంగా, రేపటికి (నవంబర్ 1న) తుపానుగా, నవంబర్ 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.శనివారం సాయంత్రం 5:30 గంటల సమయానికి ఈ వాయుగుండం చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 960 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి ఆగ్నేయంగా 980 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 1,030 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. నవంబర్ 3వ తేదీ తెల్లవారుజామున ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంగా చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. సముద్రం అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేయనున్నారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు.. వారి కుట్రలను భగ్నం చేయాలి

- మొదటి పేజీ తరువాయి

ఏక్తా నగర్‌లో నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో ఆయన ప్రసంగించారు.

ప్రతిపక్షాల తీరుపై విమర్శలు

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల బాధ్యత ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, వాటిపై నిర్మాణాత్మకంగా విమర్శలు చేయడమేనని మోదీ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ప్రతిపక్షాలు తమ బాధ్యతను పక్కనపెట్టి దేశాభివృద్ధికి అడ్డంకులు సృష్టించే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దేశాన్ని విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి చర్యలను ప్రజలు గుర్తించి ఐక్యంగా ఎదుర్కోవాలని సూచించారు.

సోషల్ మీడియాపై కీలక వ్యాఖ్యలు

సోషల్ మీడియాను తప్పుడు ప్రచారానికి, పుకార్ల వ్యాప్తికి ఆయుధంగా ఉపయోగిస్తున్నారని ప్రధాని ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే స్పందించాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి లక్ష్యంగా భారత్ ప్రయాణం

దేశం కీలక నిర్ణయాలు తీసుకుని పెద్ద లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్నప్పుడు అనేక అడ్డంకులు ఎదురవుతాయని మోదీ అన్నారు. అయినప్పటికీ భారత్ తన ప్రయాణాన్ని ఆపబోదని స్పష్టం చేశారు. దేశ సరిహద్దుల భద్రత, అక్రమ చొరబాట్ల నియంత్రణ వంటి అంశాలపైనా ఆయన ప్రస్తావించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకుంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగడమే ప్రతి భారతీయుడి బాధ్యత అని ప్రధాని తన ప్రసంగంలో ఉద్ఘాటించారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం.. నేడు పోలింగ్!

బ్యాలెట్ బాక్సుల తరలింపు, భద్రత కోసం 1,543 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించేందుకు డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచారు. పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఏపీ స్పెషల్ పోలీస్‌కు చెందిన 130 ప్లటూన్లను మోహరించారు. డీజీపీ కార్యాలయం నుంచి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, క్విక్ రియాక్షన్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయని పునేతా వివరించారు.

సుప్రీం ఆదేశాలతో సంపూర్ణ నిఘా

ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇప్పటికే 6,600 పోలింగ్ లొకేషన్లలో 12,000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5,500 సమస్యాత్మక (సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్) కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కెమెరాలు లేని చోట్ల వీడియోగ్రఫీ, అది కూడా సాధ్యం కాని మారుమూల ప్రాంతాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట జరిగే ప్రతి కదలికను రికార్డు చేస్తామని అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలు చివరి నిమిషంలో వచ్చినా, సాధ్యమైనంత వరకు అన్ని కేంద్రాలను నిఘా పరిధిలోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని పునేతా పేర్కొన్నారు.

బరిలో 9,642 మంది అభ్యర్థులు.. 75 వేల సిబ్బంది

రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ మేయర్/చైర్‌పర్సన్ పదవులకు 153 మంది, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు 367 మంది పోటీలో ఉన్నారు. కార్పొరేషన్లలోని 922 వార్డులకు 3,773 మంది, మున్సిపాలిటీల్లోని 2,382 వార్డులకు 6,669 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం మీద వార్డు పదవుల కోసం 9,642 మంది పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలింగ్ సిబ్బంది ఇప్పటికే డిస్పాచ్ కేంద్రాల నుంచి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు.

ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం వివరాలను మీడియాకు వెల్లడిస్తామని ఎస్ఈసీ తెలిపింది.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచాల్సిన అవసరం ఉందని ఎస్ఈసీ అనిల్ పునేతా అభిప్రాయపడ్డారు. ఓటర్లలో చైతన్యం పెంచేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీలు (పిడుగురాళ్ల, గుడిజాల, దాచేపల్లి, దార్సి, పలమనేరు, ప్రొద్దుటూరు, రాయచోటి, కమలాపురం) ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎక్కువ కాలం అమల్లో ఉంటే అభివృద్ధి పనులు కుంటుపడతాయని, అందుకే ఈ ప్రక్రియను త్వరగా ముగించడం అందరికీ శ్రేయస్కరమని పునేతా పేర్కొన్నారు.

చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో

చూశాక కన్నీళ్లు ఆగడం లేదు

అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుష దాడిపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, గుండె బరువెక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు. ఉన్మాది ఘాతుకం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది," అని ఆయన అన్నారు. ఆడపిల్లలు, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, ఉన్మాదులను ఉక్కుపాదంతో అణిచివేస్తామని లోకేశ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. మహిళల వైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడే వాతావరణం సృష్టిస్తామని ఆయన స్పష్టం చేశారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించేవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసలేం జరిగిందంటే..

రాప్తాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి నేరుగా పదో తరగతి గదిలోకి ప్రవేశించి, అక్కడ ఉన్న విద్యార్థినిపై చెట్ల కొమ్మలు నరికే రంపంతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపై కూడా దుండగుడు దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనతో పాఠశాలలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఉపాధ్యాయులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో నిందితుడు

ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. ధర్మవరం వైపు పారిపోతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ధర్మవరం మండలానికి చెందిన యువకుడిగా గుర్తించారు. బాధితురాలికి అతను దగ్గరి బంధువేనని స్థానికులు చెబుతున్నారు. వ్యక్తిగత కక్షల కారణంగానే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత అమానుషమైన చర్య అని పేర్కొన్నారు.

బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, ఆమె ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా ఈ ఘటనపై స్పందించి, బాలికకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది.. రాప్తాడు ఘటనే నిదర్శనం

ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు."రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తరగతి గదిలోనే ఒక విద్యార్థినిపై రంపంతో జరిగిన కిరాతక దాడి.. టీడీపీ కూటమి పాలనలో శాంతిభద్రతలు ఎంతగా విఫలమయ్యాయో స్పష్టం చేస్తోంది. ఒక ప్రభుత్వ పాఠశాలలోకి దుండగుడు స్వేచ్ఛగా ఎలా ప్రవేశించి, ఒక బాలికపై ఇంత దారుణంగా దాడి చేయగలిగాడు? విద్యాసంస్థల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని జగన్ పేర్కొన్నారు. బాధితురాలిని కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి, రాజకీయ కక్ష సాధింపులు, 'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా రెచ్చిపోతున్నారని జగన్ ఆరోపించారు. గాయపడిన విద్యార్థినులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, పారదర్శక విచారణ ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమీక్ష జరపాలని, ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని జగన్ అన్నారు.

ఘటన వివరాలు, ప్రభుత్వ స్పందన

రాప్తాడులోని ఓ పాఠశాలలో శనివారం ఓ దుండగుడు తరగతి గదిలోకి ప్రవేశించి పదో తరగతి విద్యార్థినిపై ఎలోక్ట్రిక్ రంపంతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో విద్యార్థిని ముఖం, తల, గొంతు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుడి చేయి దాదాపు తెగిపోయినట్లు సమాచారం. ఆమెను కాపాడబోయిన మరో విద్యార్థిని కూడా తీవ్రంగా గాయపడింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో, వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. మరోవైపు, ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె కోలుకునే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య బృందాన్ని ఆదేశించానని తెలిపారు. "ఈ ఘాతుకానికి పాల్పడిన మృగాడిని పట్టుకుని, చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీసులను ఆదేశించాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం ఆయన బాధితురాలి తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి కూడా ఆయన ఆరా తీశారు. ఈ ఘటనను నారా లోకేశ్ కూడా తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పోలీసులు విస్తృత స్థాయి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం.. ఫ్యాక్టరీలో నలుగురు సజీవ దహనం

దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగోల్‌పురి ప్రాంతంలోని ఒక ఫ్యాక్టరీలో రాత్రి చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. ఒక పాదరక్షల తయారీ పరిశ్రమ బేస్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది 20 ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఫ్యాక్టరీలో చిక్కుకున్న మరో ఆరుగురిని రెస్క్యూ టీమ్ సురక్షితంగా బయటకు తీసుకువచ్చింది.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఫ్యాక్టరీలో పాదరక్షల తయారీకి వినియోగించే

రబ్బరు నిల్వలు భారీగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయని అధికారులు భావిస్తున్నారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఖైబర్ పఖ్తుంఖ్వాపై పాక్ సైన్యం కన్ను.. ఖనిజ సంపదే లక్ష్యమా?

పాకిస్థాన్ సైన్యం అనుసరిస్తున్న కఠిన వైఖరి, ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనలకు దారితీస్తున్నాయి. బలప్రయోగంతోనే తిరుగుబాట్లను అణచివేయవచ్చనే ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతం ఇప్పుడు ఈ ప్రావిన్స్‌లో పరీక్షకు నిలిచింది. అయితే, ఈ చర్యల వెనుక అసలు లక్ష్యం ప్రావిన్స్‌లోని అపారమైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవడమేనని అంతర్జాతీయ నివేదికలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

'గ్రీక్ సిటీ టైమ్స్' ప్రచురించిన ఒక కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అకస్మాత్తుగా రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించడం వెనుక పెద్ద వ్యూహం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 11న రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234 కింద అత్యవసర అధికారాలను ఉపయోగించి ఫెడరల్ ప్రభుత్వం ప్రావిన్స్‌లో గవర్నర్ పాలన విధించింది. ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిదిని కస్టడీలోకి తీసుకుంది. పాకిస్థాన్ 18వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఖనిజాలు ప్రావిన్సుల ఆధీనంలో ఉంటాయి. తాజా చర్యలతో ప్రావిన్షియల్ అసెంబ్లీ రద్దవడంతో, ఖనిజాలపై ఫెడరల్ ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించినట్లయింది.

దాదాపు 4 కోట్ల జనాభా, బలమైన రాజకీయ వ్యవస్థ, ఇప్పటికే కొనసాగుతున్న సాయుధ తిరుగుబాటు, పొరుగునే శత్రుదేశంగా భావించే ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు వంటి క్లిష్టమైన పరిస్థితులున్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో సైనిక వ్యూహం బెడిసికొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భద్రతా వైఫల్యాల కారణంగానే ఎమర్జెన్సీ విధించామని ఇస్లామాబాద్ చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2026 ప్రథమార్ధంలోనే 122 మంది పోలీసులు మరణించగా, హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేయడం, ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడం, ప్రావిన్స్ వనరులను కేంద్రం, విదేశీ కొనుగోలుదారులకు అప్పగించే ప్రయత్నం చేయడం వంటి చర్యలు తీవ్రవాద గ్రూపులకు కొత్త ఆయుధాన్ని అందించినట్లే అవుతుందని ఆ నివేదిక హెచ్చరించింది. ఇది ఖైబర్ పఖ్తుంఖ్వాను కూడా బలూచిస్థాన్ లాగా పాలనారహిత ప్రాంతంగా మార్చే ప్రమాదం ఉందని, ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయం కంటే భద్రతాపరమైన నష్టమే ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెస్క్యూ మిషన్ విఫలం.. భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్

- మొదటి పేజీ తరువాయి

అతికష్టంగా ప్రయాణిస్తోంది. నేడో రేపో భూమిపై కూలిపోవచ్చని యూఎస్ స్పేస్ ఫోర్స్ అంచనా వేస్తోంది. సుమారు ఒకటిన్నర టన్ను బరువున్న ఈ పరికరం చాలావరకు వాతావరణంలోనే కాలిపోతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కొన్ని భాగాలు, అద్దాల ముక్కలు మాత్రం భూమిపై పడే అవకాశాలు ఉన్నాయని మిషన్ ముఖ్య శాస్త్రవేత్త, నాసాకు చెందిన బ్రాడ్ సెంకో తెలిపారు. స్విఫ్ట్ అబ్జర్వేటరీ 2004 నవంబర్ 20న అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. విశ్వంలో అత్యంత శక్తిమంతమైన విస్ఫోటనాలైన గామా రే బరస్ట్స్, సూపర్‌నోవాల అన్వేషణకు దీన్ని ప్రయోగించారు. అయితే.. ఇది వేగంగా కిందికి దిగుతుండటంతో రెస్క్యూ చేసే బాధ్యతను 'కాటలిస్ట్ స్పేస్'కు నాసా అప్పగించింది. ఈ ఏడాది జులైలో ఆ సంస్థ ప్రయోగించిన 'లింక్' అనే మూడు చేతుల రోబో ప్రయోగం విఫలమై.. సెప్టెంబర్‌లో భూమిపై కూలిపోయింది.

ఈ క్రమంలోనే అక్టోబర్ నాటికి పరిస్థితి మరింత దిగజారడంతో టెలిస్కోప్‌లోని వ్యవస్థలను నిలిపివేశారు. 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' తన జీవితకాలంలో 2,000కుపైగా గామా రే బరస్ట్స్, 1,400 సూపర్‌నోవాలు, అనేక తోకచుక్కలు, గ్రహశకలాలను, బ్లాక్ హోల్స్‌ను పరిశీలించింది. ఖగోళంలో ఎక్కడైనా విస్ఫోటనాలు జరుగుతున్నప్పుడు ఆ దిశగా అత్యంత వేగంగా (గాఢఅట్శ్రీఎ)కదిలి దాన్ని కవర్ చేయడం ఈ టెలిస్కోప్ ప్రత్యేకత. అందుకే దీనికి 'స్విఫ్ట్' అనే పేరు పెట్టారు.

స్కూల్‌లో దారుణం..పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో పాశవిక దాడి!

- మొదటి పేజీ తరువాయి

ఆమెపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ ఘటనతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు.వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన బాలికకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.స్కూల్‌లో కొన్ని మరమ్మతు పనులు జరుగుతున్నాయని హెడ్ మాస్టర్ తెలిపారు. నిందితుడు స్కూల్లోకి వస్తున్న సమయంలో ఉపాధ్యాయులు గమనించినప్పటికీ.. వర్కర్ అనుకున్నామని వెల్లడించారు. ఘటన జరిగినప్పుడు తరగతి గదిలో టీచర్ ఉన్నట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తికి 25-30 ఏళ్ల వయసు ఉండొచ్చని అంచనా వేశారు. సరిగా గమనించే లోపే ఉన్మాది పారిపోయినట్లు పేర్కొన్నారు.కాగా, ధర్మవరం వైపు వెళుతుండగా ఆ ఉన్మాదిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆ యువకుడు బాలికకు సమీప బంధువేనని స్థానికులు చెబుతున్నారు.

దేశ యువత మిమ్మల్ని క్షమించదు

- మొదటి పేజీ తరువాయి

కూర్చొని చర్చించాల్సి రావడం వింతగా ఉందన్నారు. వ్యవస్థలన్నీ తమకు అవకాశం ఇవ్వనప్పుడు మరో మార్గం లేకపోవడంతోనే ఇలా మాక్ పార్లమెంట్ నిర్వహించాల్సి వచ్చిందన్నారు."రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే ఇంటి ఆవరణలో కూర్చొని భారత ఎన్నికల ప్రధాన అధికారి తొలగింపుపై చర్చిస్తున్నాం. చరిత్రలో ఇలా ఎన్నడూ జరగలేదు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, సాధారణ పౌరుల సమావేశంలా కనిపిస్తున్నప్పటికీ.. వాస్తవానికి ఇదొక రాజకీయ ఆయుధం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎప్పటికీ తప్పించుకోలేరు. ఆ పదవిలో కొనసాగే హక్కు ఆయనకు లేదు. ఇందుకు సంబంధించి మా దగ్గర సరైన ఆధారాలు ఉన్నాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మ

యువత క్షమించదు..

కేంద్ర ప్రభుత్వంపైనా రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఎన్నికలను తారుమారు చేయడం సహా సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అది తాత్కాలికమేనన్నారు. దేశ యువత మిమ్మల్ని క్షమించదన్నారు.

తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

- ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు

శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 31:

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శనివారం ఏఎంఆర్ గ్రూప్స్ అధినేత ఏఎంఆర్ మహేష్‌తో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు.దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అమ్మవారి దివ్యానుగ్రహం అందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

పెన్ పవర్ రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

రేణిగుంటలో కూటమి జోరు..
కమల వికాసానికి విస్తృత ప్రచారం

- బీజేపీ, టీడీపీ, జనసేన నేతల ఐక్య ప్రచారం..
-జడ్పీటీసీ, ఎంపీటీసీ,అభ్యర్థులను భారీమెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి

రేణిగుంట,పెన్ పవర్,అక్టోబర్ 31:

రేణిగుంటలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా బీజేపీ, తెలుగుదేశం, జనసేన నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. 5వ వార్డు ఎంపీటీసీ అభ్యర్థి బీడీ బాలాజీ, జడ్పీటీసీ అభ్యర్థి జీపాలెం తేజోవతిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వానికి మద్దతుగా నినాదాలు చేస్తూ కూటమి ఐక్యతను చాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, రేణిగుంట మండల ఇన్‌చార్జి మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భీమవరం నరేష్, ఎస్.ఆర్. వేణుగోపాల్, టీడీపీ బూత్ ఇన్‌చార్జి మౌనిక, క్లస్టర్ ఇన్‌చార్జి వంశీతో పాటు పూమణి, వెంకటాద్రి, మనోహర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడే (ఆదివారం) మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- సజావుగా పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్ల

పెన్ పవర్, అక్టోబర్ 31, నెల్లూరు బ్యూరో

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు.

ఆదివారం నెల్లూరు నగరపాలక సంస్థ, బుచ్చిరెడ్డిపాలెం, ఆత్మకూరు మున్సిపాలిటీలలో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో శనివారం ఎన్నికల సామగ్రి అందించే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. బుచ్చిరెడ్డిపాలెంలోని డి ఎల్ ఎన్ ఆర్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే ఎన్నికల సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పోలింగ్ ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు.. బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ సామాగ్రిని ముందుగానే సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియ మొదలుపెట్టాలని సూచించారు. ప్రతి ఒక్క ఓటరు కూడా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు.

కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఎస్.ఎల్.సి.కార్యక్రమం ఘనంగా నిర్వహించిన ఆకాశ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్.

పెన్ పవర్ రొంపిచర్ల మండలం అక్టోబర్ 31

రొంపిచర్ల మండలంలో ఆకాశ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, రొంపిచర్లలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.తమ తమ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులు, నమూనాలు మరియు వివిధ రకాల అభ్యాస కార్యక్రమాలను ప్రదర్శిస్తూ అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ఎంతో ఆత్మవిశ్వాసంతో తమ ప్రాజెక్టుల గురించి తల్లిదండ్రులకు వివరించి అందరినీ ఆకట్టుకున్నారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు మరియు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్యంగా

విద్యార్థులు కనబరిచిన ప్రతిభను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించింది.ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుంది. ఆ ప్రతిభను



వెలికితీయడమే మా ఆకాశ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లక్ష్యం స్కూల్ యాజమాన్యం తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ప్రతి ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 1 నగర పంచాయతీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- 403 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు పూర్తి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 31

నంద్యాల జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 1 నగర పంచాయతీ పరిధిలో రేపు1వ తేదీన మున్సిపల్ ఎన్నికలను ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు.

శనివారం నంద్యాల లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని (డిస్ట్రిబ్యూషన్ సెంటర్) జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ సిబ్బందికి కల్పించిన సౌకర్యాలు, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

నంద్యాల జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 1 నగర పంచాయతీ పరిధిలో పరిధిలో మొత్తం 403 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని,వీటిలో సాధారణ,సున్నిత, అత్యంతసున్నిత కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వెబ్‌కాస్టింగ్ సదుపాయాలు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కునుబాధ్యతగా వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా షేడ్స్, త్రాగునీరు, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులకు క్యూ లైన్‌లో ప్రాధాన్యతనిస్తూ త్వరగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బందికి తెలిపారు.

ఎన్నికల నియమావళి ఆంక్షలు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదు అని తెలిపారు.

100 మీటర్ల పరిధికి వెలుపల మాత్రమే ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఓటర్లకు సహాయం చేయవచ్చు అని అన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 48 గంటల నిషేధ కాలంలో మద్యం విక్రయాలనునిలిపేయడంజరిగిందన్నారు.

ఎన్నికల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పాటు కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వడం జరిగిందన్నారు.

ఎన్నికల ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో, నియోజకవర్గానికి సంబంధం లేని బయటి వ్యక్తులు వెంటనే తమ స్వస్థలాలకు వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేలా చూడాలన్నారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలి

- ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 31

నంద్యాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఓటర్లు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని నడిగడ్డ 6వ వార్డు, సరస్వతీ నగర్ 15వ వార్డు, బొగ్గులైన్ 27వ వార్డు ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, ఇతర అవసరమైన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.అనంతరం పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి

తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

నంద్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు....

- ప్రశాంత వాతావరణంలో భయం ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి....
- నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల వద్ద విధులకు హాజరైన సిబ్బందికి దిశానిర్దేశం...
- జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపీస్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 31

నంద్యాల జిల్లాలో రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

ఈరోజు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని పోలీసు బలగాలతో సమీక్ష నిర్వహించి, ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం జిల్లాలోని హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్ పోలింగ్ కేంద్రాలకు తగిన స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల భద్రతలో భాగంగా సీఐ స్ట్రైకింగ్ ఫోర్స్, ఎస్ఐ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పాటు రిజర్వ్ ఫోర్స్‌గా ఏపీఎస్పీ ప్లాటూన్లను కూడా అందుబాటులో ఉంచారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, రాష్ట్ర ఎన్నికల సంఘం

మార్గదర్శకాలు, విధి నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలపై ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించడం జరిగింది.

నంద్యాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో బయలుదేరుతున్నారు. రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, ముఖ్యంగా నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లకు పోలీసు శాఖ తరఫున విజ్ఞప్తి చేస్తూ, ప్రతి ఒక్కరూ ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి ఎన్నికల ప్రచారం లేదా ఓటర్లను ప్రభావితం చేసే విధమైన కార్యకలాపాలు నిర్వహించకూడదు. పోలింగ్ కేంద్రాల లోపలికి ఓటర్లు, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు మాత్రమే నిబంధనలకు అనుగుణంగా అనుమతించబడతారు. భద్రతా సిబ్బంది రక్షణ (సెక్యూరిటీ కవర్) కలిగిన వ్యక్తులు పోలింగ్ కేంద్రాల లోపలికి అనుమతించబడరు. వారు ఓటు వేసే అవసరం కోసం మాత్రమే నిబంధనల ప్రకారం లోపలికి వెళ్లేందుకు అనుమతి ఉంటుంది.

పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే ఎన్నికల సిబ్బందికి, పోలీసు బందోబస్తు సిబ్బందికి ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

నంద్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా, బాధ్యతాయుతమైన ఓటర్లుగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇతరులను కూడా ఓటు వేసేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, ప్రజల సహకారంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

దేశ రక్షణ ,సమాజ శ్రేయస్సు కొరకు ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలను మరువలేం.....

- నంద్యాల జిల్లా పట్టణ కేంద్రంలో విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహణ...
- నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్పి సుస్మిత ఐపీస్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 31

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పించేందుకు జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ సునీల్ సునీల్ షోరాణ్ ఐపీస్ ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి సుస్మిత ఐపీస్ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణ కేంద్రంలోని శ్రీనివాస సెంటర్ నుండి గాంధీ చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఏఎస్పి సుస్మిత ఐపీస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 31 తేదీన విధినిర్వహణలో అమరులైన పోలీసులత్యాగాలను స్మరించుకునేందుకు ఈ క్యాండిల్ ర్యాలీని నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఈరోజు ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలువబడే సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉదయం సమైక్యత పరుగు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ప్రతి భారతీయుడు ముందుగా దేశం,దేశసమగ్రత, సౌభ్రాతృత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలి.మన దేశంలో విభిన్న సంస్కృతులు ,జాతులు, కులాలు, మతాలు ఉన్న మనమందరం భారతీయులం అనేది మరిచిపోకూడదు.

దేశ రక్షణ, సమగ్రత, కొరకు సువిశాల భారతదేశాన్ని ఏకతాటిపై నడిపిన సర్దార్ వల్లభాయ్ పటేల్ మనందరికీ స్ఫూర్తిదాయకమని

తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఏ ఎస్పి సుస్మిత ఐపీస్ తో పాటు రిజర్వు ఇన్స్పెక్టర్లు బాబు సురేష్ లు ఆర్.ఎస్.ఐ హర్షవర్ధన్‌రెడ్డి , పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామి నాయక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఎన్నికల నియమావళిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

- జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల, IPS.,

పెన్ పవర్, అక్టోబర్ 31, నెల్లూరు బ్యూరో

పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, కాలనీల ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి (MCC) నిబంధనలు, వాటి అమలు, ఉల్లంఘనలకు సంబంధించిన చట్టపరమైన చర్యలపై ప్రజలకు వివరించి అవగాహన కల్పిస్తున్నారు.

ఎన్నికల సమయంలో నగదు, మద్యం, ఇతర వస్తువుల ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, ఒత్తిడి చేయడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేస్తున్నారు.

ఎన్నికల సమయంలో అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ నగదు, మద్యం రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచిస్తున్నారు.

ఎన్నికలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలు, వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు వేసే అవకాశం

నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు బుచ్చిరెడ్డిపాలెం ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ అక్టోబర్ 31.

బుచ్చిరెడ్డిపాలెం: ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న బుచ్చిరెడ్డిపాలెం మండలానికి చెందిన ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి బి. సోమ్లా నాయక్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, 2026 నవంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. 34 మండలాల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఓటును బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో అవసరమైన ధ్రువీకరణ కోసం ఎంపీడీవో కార్యాలయంలో గెజిటెడ్ అధికారిని కూడా నియమించినట్లు తెలిపారు. ఓటు వేయడానికి వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా తమఓటరు గుర్తింపుకార్డు లేదాఆధార్ కార్డుతోపాటు ఎన్నికలవిధుల ఆర్డర్‌కాపీని తీసుకు

రావాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు కల్పించిన ఈ అవకాశాన్ని ఉద్యోగులందరూసద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి బి. సోమ్లా నాయక్ విజ్ఞప్తి చేశారు.

చిట్టత్తూరు ఎంపీటీసీ అభ్యర్థి వై. మణి విజయానికి జనసేన శ్రేణులు ఐక్యంగా కదలాలి

- పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు సమష్టిగా ప్రచారంలో పాల్గొనాలి కొట్టే సాయి పిలుపు

శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 31:
తొట్టంబేడు మండలం చిట్టత్తూరు ఎంపీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ తరఫున పోటీ చేస్తున్న వై. మణి విజయానికి పార్టీ శ్రేణులందరూ ఐక్యంగా కృషి చేయాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన నాయకులు కొట్టే సాయి పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు సమన్వయంతో ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని అభ్యర్థి విజయానికి బాటలు వేయాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ విధానాలు, అభ్యర్థి లక్ష్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు.
విభేదాలకు తావులేకుండా ఐకమత్యం, క్రమశిక్షణతో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు.జనసేన కుటుంబంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకొచ్చి వై. మణి విజయమే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని కొట్టే సాయి విజ్ఞప్తి చేశారు.

కార్మికుల హక్కుల పరిరక్షణే ఏఐటీయూసీ లక్ష్యం

- కార్మిక ఐక్యతతో హక్కుల సాధనకు నిరంతర పోరాటం జనముల గురవయ్య, కత్తి రవి

శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 31:
ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల యూనియన్ నాయకులు జెండాలను ఆవిష్కరించి, కార్మికహక్కులకోసంపోరాడిప్రాణాల ర్పించినఅమరవీరులకు ఘనంగా నివాళు లర్పించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జనముల గురవయ్య, కత్తి రవి మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న ముంబైలో స్థాపించబడిన ఏఐటియుసి భారతదేశంలో తొలి జాతీయ స్థాయి కార్మిక సమాఖ్యగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించు కుందన్నారు. లాలాలజపతిరాయ్ తొలి అధ్యక్షుడిగా కార్మిక ఉద్యమానికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు.

కార్మికుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, సమాన పనికి సమాన వేతనం సాధన కోసం ఏ ఐటియుసి నిరంతరంపోరాటాలునిర్వహిస్తోందన్నారు . కార్మికుల హక్కుల సాధనలో ఐక్యతే ప్రధాన బలమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏరియా కార్యదర్శి తొండు మల్లి అర్జున్, సీపీఐ పట్టణ కార్యదర్శి రోద్ద గోపి, మండల కార్యదర్శి మించిన శివకుమార్, మున్సిపల్ శానిటరీ యూనియన్ నాయకులు కోకిల హరి, జాన్, మెడికల్ సెక్యూరిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు మురుసు ప్రేమ్, తొండు గోపి, రోద్ద మూర్తి, అంబులెన్స్ యూనియన్ నాయకులు దిలీప్ భాషా, జాకీ, అంజి, సివిల్ సప్లై గోడౌన్ యూనియన్ నాయకులు అయ్యప్ప, గిరి, దాము, స్ట్రీట్ వెండర్స్ నాయకులు జనార్దన్, ప్రజానాట్యమండలి నాయకులు చారులత, అంజూరు గురవయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ముని చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే ఎర్రజెండాకు మద్దతివ్వండి

- పాత వీరాపురం ఎంపీటీసీ అభ్యర్థి చల్లా సరళకు మద్దతుగా సీపీఎం విస్తృత ప్రచారం

ఏర్పేడు,పెన్ పవర్,అక్టోబర్ 31:
పాత వీరాపురం ఎంపీటీసీ అభ్యర్థి చల్లా సరళకు మద్దతుగా సీపీఎం నాయకులు శనివారం పాత వీరాపురం, ఎస్టీ కాలనీ, ఇసుక తాగేలి, బీసీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ గ్రామంలోని తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రహదారులు, ఇంటి స్థలాలు, మరుగుదొడ్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.
ఎస్టీ కాలనీలో పశువుల కొట్టంగా మారిన అంగన్‌వాడీ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేలా పోరాడతామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతూ, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థి చల్లా సరళకు మద్దతు ఇవ్వాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగయ్య, కరీముల్లా, వెంకటేశ్వరరావు, రాంబాబు, నాగరాజు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు

- దేశ సమగ్రతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం

ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ

శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 31:
శ్రీకాళహస్తిలోని ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..
స్వతంత్ర భారతదేశంలోని 500కు పైగా సంస్థానాలను దేశంలో విలీనం చేసి భారత సమగ్రతకు పునాది వేసిన ఘనత

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. దేశ తొలి ఉప ప్రధానిగా, హోం మంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. భిన్న భాషలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు నిలయమైన భారతదేశ ఐక్యతను, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులు పటేల్

ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగారాం, డాక్టర్ సునీత, డాక్టర్ సుధీర్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ సతీష్, డాక్టర్ సుబ్బారావు తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా ఉంటే.. ప్రయాణం ఎలా సాగేది?

- గుంతలమయంగా పాపానాయుడుపేట ప్రధాన రహదారి.. అధికారుల నిర్లక్ష్యంపై సీపీఎం నేత ఆగ్రహం

ఏర్పేడు, పెన్ పవర్, అక్టోబర్ 31:
పాపానాయుడుపేటకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు షేక్ కరీముల్లా ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై బావులను తలపించేలా పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.
ఈ మార్గంలో ఆలయాలు, పరిశ్రమలు, కళాశాలలు ఉండటంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారని పేర్కొన్నారు.
సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టడంతో పాటు నూతన రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే స్థానికులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అదృశ్యమైన రాథోడ్ అభి ఆచూకీ కనుగొనాలని పోలీసులను కోరిన భూక్య జాన్సన్ నాయక్

పెన్ పవర్,అక్టోబర్ 31:
కడెం మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అభి అనే యువకుడు కనిపించకుండా పోయిన విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జిబుక్య జాన్సన్ నాయక్ గారు స్థానిక గంగాపూర్ గ్రామ ప్రజలతో కలిసి ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గారిని కలిసి యువకుడి అదృశ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు

చదువుల బడిలో దాడుల కలకలం.. విద్యార్థినుల రక్షణకు భరోసా ఏదీ

- విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించలేరా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు పటిష్ట భద్రత కల్పించాలి పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. జాకీర్

శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 31:
అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో విద్యార్థినులపై రంపంతో జరిగిన దాడి ఘటనను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) తీవ్రంగా ఖండించింది. విద్య నేర్చుకోవాల్సిన తరగతి గదిలోకి చొరబడిన వ్యక్తి విద్యార్థినిపై రంపంతో దాడి చేయడం, అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపై కూడా దాడికి పాల్పడటం అత్యంత ఆందోళనకరమని పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. జాకీర్ పేర్కొన్నారు.
పాఠశాలలే విద్యార్థులకు భద్రత కల్పించలేని పరిస్థితి ఏర్పడితే పిల్లలను బడికి పంపించే తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ ఉంటుందని ఆయన ప్రశ్నించారు. పాఠశాలలు విద్యాబోధనకు

నిలయాలుగా ఉండాలి తప్ప భయాందోళనలకు కేంద్రాలుగా మారకూడదన్నారు. విద్యార్థుల భద్రత ప్రభుత్వంతో పాటు విద్యాశాఖ అధికారుల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు.
పిడిఎస్ యు ప్రధాన డిమాండ్లు ఇవే..
రాప్తాడు ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి.
రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
అనధికార వ్యక్తులు పాఠశాలల్లోకి ప్రవేశించకుండా భద్రతా సిబ్బందిని నియమించాలి.
విద్యార్థినుల రక్షణకు ప్రత్యేక చర్యలు, అత్యవసర స్పందన వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
పాఠశాలల్లో భద్రతా ఏర్పాట్లపై విద్యాశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.
విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ప్రాణాలకు రక్షణ కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని జాకీర్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పాఠశాలల భద్రతపై సమగ్ర సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు, ప్రతి పాఠశాలలో సురక్షిత వాతావరణం కల్పించే వరకు పిడిఎస్ యు పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

బీసీల మద్దతు ఎన్డీఏ కూటమికే.. తిరుపతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలి గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి,పెన్ పవర్,అక్టోబర్ 31:
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 54 శాతం బీసీల మద్దతు ఎన్డీఏ కూటమికే ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తిరుపతి మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్‌తో పాటు ఎన్డీఏ కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీసీ సోదరులకు విజ్ఞప్తి చేశారు.
ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో తిరుపతిలో సిమ్స్ ఆసుపత్రి, మహిళా ప్రాంగణం, మహిళా విశ్వవిద్యాలయం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఎన్డీఏ కూటమి పాలనలో పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు.
తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రపంచవ్యాప్తంగా భక్తులు తరలివచ్చే నేపథ్యంలో తిరుపతిలో భద్రత, వసతి, మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచి ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. వైసీపీ కులాల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా తిరుపతి అభివృద్ధిని ఆకాంక్షించే ప్రజలంతా ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు.

కాలేజీఆసుపత్రి మధ్య టపాసుల విక్రయాలా

- విద్యార్థులు, రోగుల భద్రత గాలికి.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది

- అధికారుల ముందస్తు చర్యలు ఏవీ

- గతంలో ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలు ఏమయ్యాయి

శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 31:
దీపావళి అంటే వెలుగుల పండుగ.. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. ఆనందం, ఆప్యాయతలు, అనురాగాలను పంచుకునే ఈ పండుగను శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. అయితే ఈ పండుగ వేళ టపాసుల విక్రయాల నిర్వహణ ప్రజల భద్రతకు ప్రశ్నార్థకంగా మారుతోంది.
శ్రీకాళహస్తిలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ఏపీఎస్ఆర్టీసీ డీజిల్ బంకు సమీపంలోనే టపాసుల విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు చదువుకునే కళాశాల పక్కన, రోగులు చికిత్స పొందే ఆసుపత్రి సమీపంలో పేలుడు పదార్థాల విక్రయాలకు అనుమతి ఎలా ఇచ్చారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
గత ఏడాది టపాసుల విక్రయాలపై అప్పటి ఆర్డీవో స్పష్టమైన నిబంధనలు వివరిస్తూ, 2026 నుంచి పట్టణానికి దూరంగా అనువైన ప్రాంతాల్లోనే విక్రయాలు నిర్వహించాలని సూచించినట్లు వ్యాపారులు కూడా అంగీకరించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా రద్దీ ప్రాంతాల్లో విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
ఒకవైపు విద్యార్థులు, మరోవైపు ఆసుపత్రికి వచ్చే రోగులు, ఇంకోవైపు డీజిల్ బంకు.. ఇలాంటి సున్నితమైన ప్రాంతాల మధ్య టపాసుల విక్రయాలు కొనసాగితే అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు పరిస్థితి ఏమిటి? ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు? ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నది ప్రజల ప్రశ్న.
చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కాకుండా, ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొనాలి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విక్రయ ప్రాంతాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఆర్డీవో స్పందించి గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయిస్తారా? లేక ఏదైనా ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తారా? అన్నది వేచి చూడాలి.

తొట్టంబేడులో వైఎస్సార్‌సీపీ ప్రచార జోరు.. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి

- జడ్పీటీసీ అభ్యర్థి ఉన్నం వాసుదేవ నాయుడుతో పాటు ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపునకు ఇంటింటా ప్రచారం

శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 31:
తొట్టంబేడు మండలంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మండలంలోని శివనాథపురం, కొత్త కండ్రిగ, లక్ష్మీపురం, చిట్టత్తూరు, కాంచనపల్లి, బోనుపల్లి, గాజుల కండ్రిగ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి శ్రీ పవిత్ర రెడ్డి, మాజీ ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి ఉన్నం వాసుదేవ నాయుడుతో పాటు ఎంపీటీసీ అభ్యర్థులు రేవతి, తుపాకుల చెంచయ్య, కౌసల్య, కౌగిలి సుబ్రహ్మణ్యం, సి. రజినీలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.
జగనన్న ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరిగిందని, ప్రస్తుత పాలనలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను వివరిస్తున్నారని, వాటన్నింటికీ ఎన్నికల్లో ఓటు ద్వారా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పవిత్ర రెడ్డి అన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య

నాయుడు, మాజీ ఎంపీటీసీ నరసింహులు, మాజీ సర్పంచులు రాజ్ ప్రకాష్, ఆళ్లయ్య, కృష్ణమూర్తి తదితరులతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోళ గోల్డ్ లోన్ ప్రారంభం

పెన్ పవర్,(ప్యాపిలి):
పట్టణంలోని డోన్ రహదారిలో చోళ గోల్డ్ లోన్ బ్రాంచ్ శనివారం మధ్యాహ్నం ప్రారంభమైంది. బ్యాంక్ మేనేజర్ తొండపాటి రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆర్ఎం రవీంద్రనాథ్ ఠాగూర్ ముఖ్య అతిథిగా హాజరై బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు పొందాలనుకునే వారికి తమ సంస్థలో రుణ సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. బంగారం విలువ ఆధారంగా రుణాలు మంజూరు చేయడంతో పాటు వివిధ రుణ పథకాలు, వడ్డీ రేట్లు, తిరిగి చెల్లింపు విధానాలపై ఖాతాదారులకు వివరించారు. అత్యవసర ఆర్థిక అవసరాలకు బంగారంపై రుణాలు పొందాలనుకునే వారికి ఈ బ్రాంచ్ సేవలు అందించనుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, బ్యాంకు సిబ్బంది సాయి, వీరాంజనేయులు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు రామకృష్ణ మిషన్ చేయూత

- చొల్లంగి గ్రామంలో 200 కుటుంబాలకు రూ.2 లక్షల విలువైన నిత్యావసర సరుకుల పంపిణీ

తాళ్లరేవు, అక్టోబర్ 31:
అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితులకు రామకృష్ణ మిషన్ రాజమండ్రి ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామంలో శనివారం 200 మంది తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులతో కూడిన రేషన్ కిట్లను పంపిణీ చేశారు.
ఈ విషయాన్ని రామకృష్ణ మిషన్ రాజమండ్రి కార్యదర్శి శ్రీమత్ స్వామి పరిజ్ఞేయానంద జీ మహారాజ్ వెల్లడించారు. సుమారు రూ.2 లక్షల విలువైన రేషన్ కిట్లను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఒక్కో కిట్‌లో కిలో కందిపప్పు, కిలో మినపప్పు, కిలో పంచదార, కిలో ఇడ్లీ రవ్వ, కిలో గోధుమ పిండి, కిలో కారచి రవ్వ, అర కిలో వేరుశనగ గుళ్లు, ఒక కిలో సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్, 250 గ్రాముల టీ పొడి, అర కిలో చింతపండు అందజేశారు.
ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు అండగా నిలవడం, వారి అవసరాలను గుర్తించి సహాయం అందించడం సేవా కార్యక్రమాల్లో భాగమని రామకృష్ణ మిషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడం ద్వారా కొంత ఉపశమనం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ రాజమండ్రి ప్రతినిధులు స్వామి లోకమయానంద, బ్రహ్మచారి మనోజ్, రామకృష్ణ సేవా సమితి సభ్యులు మహాలక్ష్మి,

శేఖర్, అప్పారావు, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, ఇంజనీర్ బి.ఆర్.ఎస్. శ్రీకాంత్, కాను మోను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నెల్లూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీల్లో నవంబర్ 1న పోలింగ్
- మొత్తం 128 వార్డులు.. 594 పోలింగ్ కేంద్రాలు.. 5,52,318 మంది ఓటర్లు
- పోలింగ్ విధులకు 4,351 మంది సిబ్బంది..
- భద్రత కోసం 1,725 మంది పోలీసులతో బందోబస్తు
- పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు, అక్టోబర్ 30:(క్రౌన్ హ్యూమన్ రైట్స్):
జిల్లాలోని నెల్లూరు నగరపాలక సంస్థ, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలకు నవంబర్ 1వ తేదీన నిర్వహించనున్న ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

మొత్తం 5,52,318 మంది ఓటర్లు
జిల్లాలోని నెల్లూరు, ఆత్మకూరు, బుచ్చి మూడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 128 వార్డులు ఉండగా, 594 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో మొత్తం 5,52,318 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 2,68,309 మంది పురుషులు, 2,83,921 మంది మహిళలు, 88 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.
మున్సిపాలిటీల వారీగా వివరాలు పరిశీలిస్తే నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 72 వార్డులు, 509 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 2,37,972 మంది పురుషులు, 2,51,293 మంది మహిళలు, 86 మంది ఇతరులు కలిపి మొత్తం 4,89,351 మంది ఓటర్లు ఉన్నారు.
ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డులు, 30 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 12,654 మంది పురుషులు, 13,875 మంది మహిళలు కలిపి మొత్తం 26,529 మంది ఓటర్లు ఉన్నారు.
బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డులు, 55 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17,683 మంది పురుషులు, 18,753 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు కలిపి మొత్తం 36,438 మంది ఓటర్లు ఉన్నారు.
సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపులి
ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక, సాధారణ కేంద్రాలుగా గుర్తించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 594 పోలింగ్ కేంద్రాల్లో 52 అత్యంత సున్నిత, 200 సున్నిత, 342 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా వర్గీకరించారు.
నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 52 అత్యంత సున్నిత, 174 సున్నిత, 283 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆత్మకూరులో 30 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉండగా, బుచ్చిరెడ్డిపాళెంలో 26 సున్నిత, 29 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

4,351 మంది పోలింగ్ సిబ్బంది నియామకం
పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు మొత్తం 4,351 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 713 మంది ప్రిసైడింగ్ అధికారులు (PO), 713 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ), 2,851 మంది ఇతర పోలింగ్ అధికారులు (OPO), 74 మంది మైక్రో అబ్జర్వర్లు (MO) ఉన్నారు.
నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 3,720 మంది, ఆత్మకూరు మున్సిపాలిటీలో 230 మంది, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలో 401 మంది సిబ్బందిని పోలింగ్ విధులకు కేటాయించారు.

ఎన్నికల బందోబస్తుకు 1,725 మంది పోలీసు సిబ్బంది
పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లావ్యాప్తంగా 1,725 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో 31 మంది సీఐలు, 88 మంది ఎస్సైలు, 346 మంది ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు, 897 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 363 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

115 వాహనాల ఏర్పాటు.. 82 బస్సులు వినియోగం
ఎన్నికల విధుల నిర్వహణ, పోలింగ్ సిబ్బంది రవాణా తదితర అవసరాల కోసం మొత్తం 115 వాహనాలను ఏర్పాటు చేశారు. వీటిలో 33 కార్లు, 82 బస్సులు ఉన్నాయి. నెల్లూరు నగరపాలక సంస్థకు 15 కార్లు, 70 బస్సులు కలిపి 85 వాహనాలు, ఆత్మకూరుకు 10 కార్లు, 7 బస్సులు కలిపి 17 వాహనాలు, బుచ్చిరెడ్డిపాళెంకు 8 కార్లు, 5 బస్సులు కలిపి 13 వాహనాలను కేటాయించారు.

50 ఎన్నికల నిఘా బృందాల ఏర్పాటు
ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల వ్యయ పరిశీలన, అక్రమ నగదు, ఇతర ప్రలోభాల నియంత్రణ కోసం జిల్లావ్యాప్తంగా 50 బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో 11 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ (FST), 16 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (SST), 23 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (MCC) బృందాలు ఉన్నాయి. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 33, ఆత్మకూరులో 6, బుచ్చిరెడ్డిపాళెంలో 11 బృందాలను నియమించారు.
1,790 పోస్టల్ బ్యాలెట్లు జారీ
ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది, సర్వీస్ ఓటర్లు, పీడీ యాక్ట్ పరిధిలోని ఓటర్లకు కలిపి మొత్తం 1,790 పోస్టల్ బ్యాలెట్లు జారీ చేశారు. వీటిలో పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బందికి 1,677, సర్వీస్ ఓటర్లకు 99, పీడీ యాక్ట్ పరిధిలోని ఓటర్లకు 14 పోస్టల్ బ్యాలెట్లు జారీ చేశారు.మున్సిపాలిటీల వారీగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 1,390, ఆత్మకూరులో 208, బుచ్చిరెడ్డిపాళెంలో 192 పోస్టల్ బ్యాలెట్లు జారీ చేసినట్లు తెలిపారు.
ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రాజకీయ కక్షసాధింపులకు అతీతంగా చంద్రబాబు అభివృద్ధి, సుపరిపాలనతో ప్రత్యర్థుల్ని కట్టడి చేస్తున్నారు : ప్రత్తిపాటి

జగన్ అక్రమ నిర్బంధం నుంచి 2023లో ప్రజానాయకుడు చంద్రబాబు, విడుదలై సరిగ్గా నేటికి మూడేళ్లు.

-చంద్రబాబు అక్రమ అరెస్ట్ తో జగన్ విశ్వవ్యాప్తంగా జనాగ్రహాన్ని చవిచూశాడు. సెప్టెంబర్ 9, 2023న చంద్రబాబును నిర్బంధించినప్పుడు, చిలకలూరిపేట టీడీపీ శ్రేణులు కనీవినీ ఎరుగని పోరాటపటిమ చూపారు.

చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 31 :
జగన్ అరాచకాలు, దుర్మార్గాల నుంచే కూటమి ఏర్పాటైందని, అధికారగర్వంతో నాడు చంద్రబాబు అక్రమ అరెస్ట్ తో జగన్ విశ్వవ్యాప్తంగా జనాగ్రహాన్ని చవిచూశాడని, దాంతో తప్పుచేశానని పశ్చాత్తాపంతో తలపట్టుకునే పరిస్థితి ఆయనకు వచ్చిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.
జగన్ రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా జైలుకెళ్లిన చంద్రబాబు, 53 రోజుల నిర్బంధం తర్వాత 2023 అక్టోబర్ 31న విడుదలయ్యారని, అది జరిగి సరిగ్గా నేటికి మూడేళ్లైందని ప్రత్తిపాటి చెప్పారు. ఆనాడు సెప్టెంబర్ 9న చంద్రబాబును నంద్యాలలో అరెస్ట్ చేసినప్పుడు రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా చిలకలూరిపేట టీడీపీ శ్రేణులు నిర్వహించిన ఉద్యమం, చూపిన పోరాట పటిమ చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆనాడు దాదాపు 2 గంటలపాటు జాతీయ రహదారిపై పార్టీ శ్రేణులు లాఠీఛార్జీని సైతం లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి చేసిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం, రాష్ట్రానికే స్ఫూర్తినిచ్చిందన్నారు.
శనివారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. చిలకలూరిపేట కూటమి ఛైర్ పర్సన్ అభ్యర్థి శ్రీమతి తోట రాజరాజేశ్వరి, జనసేన ఇన్ ఛార్జ్ తోట **రాజారమేశ్ లు ఆయనతో కలిసి విలేకరులతో మాట్లాడారు.**
ఆనాడు అధికార గర్వంతో జగన్.. చంద్రబాబును జైలుకు పంపగలిగాడు గానీ, ప్రజల్లో ఆయనపట్ల ఉన్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని బంధించలేకపోయాడని ప్రత్తిపాటి చెప్పారు. రాజకీయకక్షతో జగన్ చేయించిన అక్రమ అరెస్ట్ తో తానే నష్టపోయాడన్నారు. ప్రజా నాయకుడిని అణచివేయాలన్న జగన్ దురాలోచన తనకే బెడిసి కొట్టి, చివరకు ప్రజాగ్రహానికి బలయ్యాడని ప్రత్తిపాటి తెలిపారు. ఆనాడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ నేరుగా చంద్రబాబును కలిసి తన మద్ధతు తెలిపి, వైసీపీ ప్రభుత్వ దురాగతాలపై, జగన్ నియంత్రత్వ పోకడలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారని ప్రత్తిపాటి తెలిపారు.
చంద్రబాబు.. అభివృద్ధి, సుపరిపాలనతోనే రాజకీయ ప్రత్యర్థులకు సమాధానం చెబుతున్నారు
జగన్ అరాచకాలు, దుర్మార్గాల నుంచే నాడు కూటమి ఏర్పాటైందని, ఆనాడు పడిన బీజం.. నేడు ప్రజాప్రభుత్వాన్ని పరిరక్షించే మహావృక్షంగా మారిందన్నారు. 2024 ఎన్నికల్లో కూటమికి 94 శాతం మెజారిటీ రావడానికి కారణం జగన్ అనుసరించిన నియంత్రత్వ పోకడలేనని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ప్రజా తీర్పుతో పాలనా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు, జగన్ మాదిరిగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం లేదని, అభివృద్ధి.. సుపరిపాలనతోనే ఆయన రాజకీయ ప్రత్యర్థులకు సరైన సమాధానం చెబుతున్నారన్నారు. అమరావతి, పోలవరం నిర్మాణం, నిరంతరం సంక్షేమం, నిజమైన అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. కూటమిప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు జరిగిన అభివృద్ధి, దేశంలో మరెక్కడా జరగలేదన్నారు.

మాది ప్రజా ప్రభుత్వం.. ప్రజాభిమానంతో గెలుస్తాం తప్ప.. దౌర్జన్యాలతో పనిలేదు
2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ అనుసరించిన అప్రజాస్వామిక విధానాల్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదని, నాడు టీడీపీ అభ్యర్థుల్ని తమ దారికి తెచ్చుకోవడానికి వారు చేయని అరాచకం లేదని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు తమ పార్టీ వారిని సంతలో పశువుల్లా కొనుగోలు చేశారని, తమ మాట విననివారిపై తప్పుడు కేసులుపెట్టించి, చిత్ర హింసలకు గురిచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గొడ్డలిపార్టీ నాయకుల్లా తాము ఎవరినీ ప్రలోభపెట్టి, ఇబ్బందిపెట్టలేదని, వైసీపీ ఛైర్ పర్సన్ అభ్యర్థి షేక్ కరీమున్, ఆమె భర్త యూసఫ్ అలీలు చిత్తశుద్ధితో ఇష్టపూర్వకంగానే టీడీపీలో చేరారని ప్రత్తిపాటి తెలిపారు. గత పాలకులు చిలకలూరిపేటకు అరాచకాలు, రౌడీయిజం అనే కొత్త సంస్కృతిని తీసుకొచ్చారని, ఆనాడు చేయకూడని దుర్మార్గాలు చేసి ప్రజలకు ముఖం చూపించలేకనే 24 ఎన్నికల్లో గుంటూరుకు పారిపోయారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్పష్టం చేశారు. వైసీపీలా మాకు ప్రజావ్యతిరేక చర్యలు అవసరం లేదన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజాభిమానంతోనే గెలవబోతున్నామని ఆయన తేల్చిచెప్పారు.

స్థానిక వైసీపీ నాయకురాలు.. తన నటనతో ఎస్సైని బలిచేసింది.
వైసీపీ ఒక పెద్ద డ్రామా కంపెనీ అని,.. ఆ పార్టీ నాయకులందరినీ తలదన్నేలా స్థానిక వైసీపీ నాయకురాలు తన నటనతో మొన్నటికి మొన్న విధినిర్వహణలో ఉన్న ఎస్సైని బలిచేశారని ప్రత్తిపాటి తెలిపారు. వైసీపీ నాయకులది నటన కాకపోతే.. గెలుస్తానని నమ్మకుంటే ఆపార్టీ ఛైర్ పర్సన్ అభ్యర్థి టీడీపీలోకి ఎందుకొచ్చారో సమాధానం చెప్పాలన్నారు. నోరుందని కట్టుకథలు చెబితే ప్రజలు నమ్మరని, మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని ఆయన వైసీపీకి పరోక్ష హితవు పలికారు. జనసేనకు కేటాయించిన మున్సిపాలిటీల్లో ప్రజాదరణలో చిలకలూరిపేట మొదటి స్థానంలో ఉన్నట్టు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షలో తేలిందని ప్రత్తిపాటి చెప్పారు. మన మున్సిపాలిటీని కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి.. ఉపముఖ్యమంత్రులకు కానుకగా ఇవ్వాలని ప్రజలే నిర్ణయించుకున్నారన్నారు.

రాజరాజేశ్వరిని మీ ఆడబిడ్డగా ఆదరించి భారీమెజారిటీతో గెలిపించండి.
చిలకలూరిపేట కూటమి ఛైర్ పర్సన్ గా జనసేన నుంచి తోట రాజరాజేశ్వరిని ఎంపిక చేశారని, చిన్నవయసులోనే పెద్ద బాధ్యతలు భుజాన వేసుకున్న ఆమెను ప్రజలు తమ ఇంటి ఆడబిడ్డగా భావించాలని ప్రత్తిపాటి కోరారు. జనసేన ఇన్ ఛార్జ్ తోట రాజారమేశ్, ఛైర్ పర్సన్ అభ్యర్థి రాజరాజేశ్వరి ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటారని, పట్టణ సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండ కృషి చేస్తారని ఎమ్మెల్యే చెప్పారు. మున్సిపాలిటీలో మంచి అభివృద్ధి, సకాలంలో సమస్యల పరిష్కారానికి పట్టణ ప్రజలు 48 వార్డుల్లో కూటమి అభ్యర్థుల్నే గెలిపించాలని, రాజరాజేశ్వరికి భారీ మెజారిటీ కట్టబెట్టాలని ప్రత్తిపాటి కోరారు. వైసీపీకి వేసే ప్రతి ఓటు నిరుపయోగమేనని, మీ ఓటుకు సరైన విలువ, గుర్తింపు రావాలంటే కూటమికే వేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

మీ ఆడబిడ్డను.. మంచి మెజారిటీతో గెలిపించండి : తోట రాజరాజేశ్వరి
చిలకలూరిపేట పట్టణ ప్రజలు ప్రచారంలో చూపిన ఆదరణ, అభిమానం పోలింగ్ లోనూ కనిపించాలని, మీ ఆడబిడ్డగా నన్ను మంచి మెజారిటీతో గెలిపించాలని, మా జీవితాల్ని ప్రజాసేవకే అంకితం చేస్తామని కూటమి ఛైర్ పర్సన్ అభ్యర్థి శ్రీమతి తోట రాజరాజేశ్వరి తెలిపారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి పట్టణాభివృద్ధిలో ముందుకు సాగుతాం : తోట రాజా రమేశ్
గత ప్రభుత్వంలో నాటి పాలకులు, ప్రస్తుత ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్ట్ చేయించి పెద్ద తప్పుచేశారని, వారు చేసిన మహాపరాధంతో ఆనాడు దేశవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు వెలువడ్డాయని జనసేన ఇన్ ఛార్జ్ తోట రాజారమేశ్ తెలిపారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి సారథ్యంలో 2014-19లో నియోజకవర్గం ఊహించని విధంగా అభివృద్ధి బాట పట్టిందని, నాడు ఏ నియోజకవర్గానికి సాధ్యం కాని విధంగా 4,500 కోట్ల నిధులు సాధించి, ప్రత్తిపాటి అభివృద్ధి పట్ల తనకున్నచిత్తశుద్ధిని చాటుకున్నారని రాజారమేశ్ పేర్కొన్నారు. మరలా కూటమిప్రభుత్వంలో ప్రత్తిపాటి నేతృత్వంలో ఈ రెండేళ్లలో నియోజకవర్గంలో మరో అభివృద్ధి అధ్యాయం మొదలైందన్నారు. చిలకలూరిపేట మున్సిపాలిటీని జనసేనకు కేటాయించి, తమకు అవకాశమివ్వడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులు తమకు ప్రజాసేవ చేసుకునే అవకాశం కల్పించారని రాజా రమేశ్ తెలిపారు.
పట్టణాభివృద్ధిలో ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి ముందుకు సాగుతామని, ప్రజల రుణం తీర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తెళ్ల సుబ్బారావు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు గట్టినేని రమేష్, జనసేన నాయకులు మునీర్ హాసన్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జన్నావుల సురేంద్ర :

పెన్ పవర్, అక్టోబర్ 31:
బంగారుపాళ్యం మండలం ఆండారెడ్డిపల్లిలో స్థానిక ఎన్నికల ప్రచారంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన ఎంపీటీసీ అభ్యర్థి కిరణ్ కుమార్ గెలుపు దశగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనిన జన్నావుల సురేంద్ర ప్రతి గడపగడపకు తిరిగి గెలుపు దశగా కిరణ్ కుమార్ అఖండ విజయంతో గెలిపించాలని ప్రజలను కోరడం జరిగింది. ప్రచారంలో పాల్గొనిన మహేంద్ర మరియు హేమచంద్ర రఘుపతి రాజు మరియు ఖాదర్ బాషా షాకీర్ భాష స్థానిక నాయకులు అందరూ పాల్గొనడం జరిగింది.

వెన్నచర్ల నక్కలపల్లి గ్రామాల విద్యుత్ కష్టాలకు పరిష్కారం : మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడు

పెన్ పవర్, అక్టోబర్ 31:
నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్ల, నక్కలపల్లి గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. పెద్దకొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ ప్రత్యేక చొరవతో మూడు ఫేసుల విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది.
వెన్నచర్ల గ్రామ సమీపంలోని వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరాయిపాకుల సబ్‌స్టేషన్‌ను పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా తొలగించడంతో అప్పటి నుంచి వెన్నచర్ల గ్రామ రైతులకు మూడు ఫేసుల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రైతులు పంటలు సాగు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
ఈ సమస్యను గుర్తించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కదృష్టికి తీసుకెళ్లారు. దీంతో సంబంధిత అధికారులు స్పందించి మూడు ఫేసుల విద్యుత్ ఫీడర్‌ను మంజూరు చేశారు. కేవలం 20 రోజుల్లోనే ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపించారు.
ఈ నేపథ్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ సూచనలతో ఈరోజు చంద్రకల్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన విద్యుత్ సరఫరాను ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో నక్కలపల్లి గ్రామ సర్పంచ్ మొట్టే కురుమయ్య, వెన్నచర్ల గ్రామ ఉపసర్పంచ్ బై రాముడు, నక్కలపల్లి గ్రామ ఉపసర్పంచ్ కే. రవీందర్ రెడ్డి, ఏఈ ఉమేష్, వెన్నచర్ల మాజీ ఎంపీటీసీ డి. రవికుమార్, సీనియర్ నాయకులు పల్లెపాటి భీమ్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మేకల మల్లేష్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు దేవరపాగ లక్ష్మీకాంతం, మొట్టే శేఖర్, లైన్‌మెన్ శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ నాయకులు,రైతులు, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రకృతి విపత్తుల నిర్వహణ శిక్షణలో నాలుగో రోజు కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

పెన్ పవర్, అక్టోబర్ 31:
మంచిర్యాల జిల్లా గుడి పేటలో ఉన్న 13వ బెటాలియన్ కమాండెంట్ శిక్షణ శిబిరంలో ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల కరీంనగర్కు చెందిన 91 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వారం రోజుల ప్రకృతి విపత్తుల నిర్వహణ శిక్షణలో నాలుగో రోజు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు, ఇంటిలో ఎల్పిజి సిలిండర్ లీక్ అయితే వచ్చే అగ్ని ప్రమాదం నుండి సంరక్షించుకోవడం పై అవగాహన తో పాటుగా సమాజంలో భయం పోగొట్టే వివిధ అంశాలపై శిక్షణ అందజేస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ తెలియజేశారు. ఇలాంటి శిక్షణలు విద్యార్థులకి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఎంతో ఆవశకమని అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ప్రజా సంరక్షణలో ఎస్ ఆర్ ఆర్ కళాశాల ఎల్లప్పుడు ముందు ముందు ఉంచాలని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సూచిస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి గారు అభినందించారు
ఈ శిక్షణలో శిక్షకులు శ్రీ దుంపేట వెంకటేష్ గూండా రాకేష్, తోగరు దిలీప్, సింగని రంజిత్, ఎత్తిన రాజశేఖర్లు శిక్షణ

ఇచ్చారు.
ఈ కార్యక్రమాన్ని అశోక్ సమన్వయం చేశారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కాంపెల్లి అర్జున్, డాక్టర్ గుర్రం రాజేందర్, శ్రీమతి బి ఎలిజిబెత్ రాణి, డాక్టర్ పదాల తిరుపతి, డాక్టర్ మెట్టు వెంకటేశ్వర్లు తెలియజేశారు శాతవాహన విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త ప్రొఫెసర్ ఈ. మనోహర్ అభినందించారు.

గుంటూరులో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో క్విక్ రియాక్షన్ టీం ఏర్పాటు తెలుగుయువత అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ

గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 31,
గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే స్పందించేందుకు క్విక్ రియాక్షన్ టీం ఏర్పాటు చేసినట్లు గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద దొంగ ఓట్లు వేయడం, ఇతరుల పేర్లతో ఓట్లు వేసేందుకు ప్రయత్నించడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, భయపెట్టడం, ఒత్తిడి చేయడం, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో అనధికార ప్రచారం నిర్వహించడం, ఓటర్లను నిర్దిష్ట అభ్యర్థికి ఓటు వేయాలని ప్రభావితం చేయడం వంటి ఘటనలు జరిగితే వెంటనే క్విక్ రియాక్షన్ టీంకు సమాచారం అందించాలని కోరారు.అందిన ఫిర్యాదుల తీవ్రతను బట్టి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, కూటమి ముఖ్యనేతలతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల సంఘం అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు.
క్విక్ రియాక్షన్ టీం సంప్రదింపు నంబర్లు:
రావిపాటి సాయికృష్ణ -- గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు: 9989999889.

మన్మవ వంశీకృష్ణ -- గుంటూరు జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు: 85229 61111.
ఇరంటి వరప్రసాద్ (బాబు) -- మాజీ కార్పొరేటర్: 94901 14449.
పెద్ది విక్రమ్: 98852 99282.
ఈ సమాచారాన్ని ప్రతి ఒక్కరికీ షేర్ చేసి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేలా సహకరించాలని రావిపాటి సాయికృష్ణ కోరారు.

కూటమి అభ్యర్థి నలిగిలి కిరణ్ కుమార్‌కు మద్దతుగా ప్రచారం

గూడూరు,పెన్ పవర్, అక్టోబర్ 31:
గూడూరు గ్రామంలో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ-2 అభ్యర్థి నలిగిలి కిరణ్ కుమార్‌కు మద్దతుగా కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుని కూటమి అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ప్రచారంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎన్.ఏ. బేగ్, మండల టీడీపీ కార్యదర్శి యర ప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ బేతల స్వామి, బచ్చుల రామాంజనేయులు, రావి సత్యనారాయణ, మాగంటి నాగరాజు, అలుగు సారథి, అట్లూరి శ్రీను, దావు చంద్రశేఖర్‌తో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు సమగ్ర ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ,

విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 31,

జిల్లాలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం శనివారం విజయవాడ లయోలా కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ బృందాలకు అందిస్తున్న ఎన్నికల సామగ్రిని, వివిధ ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 222 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకునేందుకు మొత్తం 1,104 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించామని.. సీసీటీవీ కెమెరాలతో పాటు వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ), ఎంసీఎంసీ, అకౌంటింగ్ బృందాలు వంటివి సమష్టి కృషితో పనిచేస్తున్నాయని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ధ్యానచంద్ర హెచ్‌ఎం వివరించారు.

విద్యార్థినిపై రంపంతో దాడి ఘటన బాధాకరం

గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి: మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ

విజయవాడ , పెన్ పవర్,అక్టోబరు 31

అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి జరిగిన ఘటన తీవ్రంగా బాధించిందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ పేర్కొన్నారు.ఈ ఘటన జరిగిన వెంటనే మహిళా కమిషన్ బృందం స్పందించిందని తెలిపారు. ఘటనలో గాయపడిన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసినట్లు వెల్లడించారు.విద్యార్థిని లక్ష్మీగోపికను మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఆస్పత్రికి తరలిస్తున్న నేపథ్యంలో, ఆమె తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు మహిళా కమిషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎలాంటి సహాయం

అవసరమైనా, ఏవైనా ఇబ్బందులు ఎదురైనా తనను సంప్రదించాలని సూచించినట్లు పేర్కొన్నారు.విద్యార్థిని లక్ష్మీగోపిక త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు డా. రాయపాటి శైలజ తెలిపారు.మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే మౌనంగా ఉండవద్దుమహిళలు, విద్యార్థినులు ఎవరైనా వేధింపులకు గురైనా, ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించి సహాయం కోరాలని చైర్‌పర్సన్ సూచించారు. తమకు ఎదురయ్యే సమస్యలను మౌనంగా భరించకుండా ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.

మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డా. రాయపాటి శైలజ పేర్కొన్నారు.

పేటలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్: ఓటర్లకు భద్రతపై భరోసా

చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 31 :

చిలకలూరిపేట పట్టణంలో స్థానిక మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు.

అర్బన్ సీఐ ఆధ్వర్యంలో వార్డుల్లో కవాతు

అర్బన్ సీఐ పి. రమేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పట్టణంలోని పలు సమస్యాత్మక, ప్రధాన వార్డుల్లో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల వేళ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఈ కవాతు సాగింది.

కళామందిర్ సెంటర్‌లో పోలీసుల మానవహారం

కవాతులో భాగంగా కళామందిర్ సెంటర్ వద్ద పోలీసు సిబ్బంది మానవహారంగా ఏర్పడి ప్రజలకు భరోసా కల్పించారు.ఎన్నికలసమయంలోఎలాంటిఅవాంఛనీయ సంఘటనలుచోటుచేసుకోకుండాముందస్తుగాకట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.నిర్భయంగాఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపుప్రజలుఎటువంటిప్రలోభాలకు,భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రశాంత పోలింగ్ నిర్వహణకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ప్రతీ మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు

గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 31 :

జడ్పిటిసి,ఎంపీటీసీఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్నిమరోరెండు రోజులపాటు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్‌వర్మతెలిపారు. ఉద్యోగులు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల అధికారులతో శనివారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని

వినియోగించుకోవాలని రెండు రోజులపాటు – నవంబరు 1, 2 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ గడువును పొడిగించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు కొనసాగించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే సిబ్బంది తమ ఓటర్ గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. హెల్ప్ డెస్క్ సదుపాయాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. పత్రాల ధ్రువీకరణ (అటెస్టేషన్) కోసం గెజిటెడ్ అధికారులను కేంద్రంలో అందుబాటులో ఉన్నారని చెప్పారు. ప్రతీ మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి

గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 31:

కృష్ణా–గుంటూరుఉపాధ్యాయ నియోజకవర్గశాసనమండలి ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయుల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో నిర్వహించిన దూరదృశ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి శాసనమండలి ఎన్నికకు ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందిస్తారని, అర్హులైన ఉపాధ్యాయులందరూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.నవంబర్ 6 ఓటర్ల నమోదుకు చివరి తేదీ అని, గడువులోగా దరఖాస్తు చేసుకోని వారికి మరో అవకాశం ఉండదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో 13,505 మంది ఓటర్లుగా నమోదు కాగా, ఈసారి ఇప్పటివరకు 8,414 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలిపారు.

మండలాల వారీగా అర్హులైన ఉపాధ్యాయులను గుర్తించి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అర్హులందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. వీలైనంతవరకు అంతర్జాలం ద్వారా దరఖాస్తులు సమర్పించేలా ప్రోత్సహించాలని, అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించాలని అధికారులను ఆదేశించారు.

నిర్ణీత గడువులోగా అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఖాజావలి కోరారు.

అంబరాన్నంటిన మహిళా శక్తి సంబరం.. సరస్ మేళాలో రూ.12.11 కోట్ల అమ్మకాలు కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 31

విజయవాడ పున్నమిఘాట్‌లో నిర్వహించిన జాతీయ సరస్ మేళా–2026 మహిళా సాధికారతకు అద్భుత వేదికగా నిలిచింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లకు సందర్శకుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఇప్పటివరకు ఈ మేళాలో రూ. 12 కోట్ల 11 లక్షల అమ్మకాలు నమోదయ్యాయి. సందర్శకుల కోరిక మేరకు మేళాను నవంబర్ 1వ తేదీ సాయంత్రంవరకుపొడిగించారు.కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ఏపీ సెర్ప్ సహకారంతో 19 రోజులుగా నిర్వహించిన ఈ జాతీయ స్థాయి మేళాలో సుమారు 650 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఇందులో 50 ప్రత్యక్ష ఆహార విక్రయ కేంద్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులు,గృహోపకరణాలు,సంప్రదాయకళాఖండాలు, వివిధ రాష్ట్రాల ప్రత్యేక ఆహార పదార్థాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహంగ్రామీణ మహిళల్లో ఉన్న నైపుణ్యాన్ని, సృజనాత్మకతను వెలికితీసి వారిని విజయవంతమైనపారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సరస్ మేళా ఎంతగానో దోహదపడిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఈ మేళాలో నమోదైన రూ.12.11 కోట్ల అమ్మకాలు మహిళా స్వయం సహాయక సంఘాల నాణ్యమైన ఉత్పత్తులకు, వ్యాపార నైపుణ్యానికి నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టాళ్ల ద్వారా సుమారు రూ.2 కోట్ల అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.మహిళలకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణమహిళలుతమవ్యాపారాలనుమరింతవిస్తరించుకునేందుకు ఉత్పత్తుల నాణ్యత, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, డిజిటల్ విక్రయాలు, ఎగుమతి అవకాశాలు, వ్యాపార నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వీటి ద్వారా మహిళలు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు పరిచయం చేసుకునే అవకాశాలుమెరుగుపడ్డాయనిఅధికారులుతెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణ ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలుసందర్శకులనువిశేషంగాఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలు, జానపద కళారూపాలు, సంగీత ప్రదర్శనలు జాతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటిచెప్పాయి.మేళా ముగింపు సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, సరస్ సమన్వయకర్త కటారియా, సెర్ప్ డైరెక్టర్లు చక్రవర్తి, శివశంకర్ తదితరులుపాల్గొన్నారు.అత్యుత్తమస్టాళ్లను నిర్వహించిన మహిళలకుధ్రువపత్రాలుఅందజేసి సత్కరించారు.సరస్ మేళా విజయవంతానికి సహకరించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఏపీ సెర్ప్ అధికారులు, సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాలు, స్టాల్ నిర్వాహకులు, కళాకారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.సందర్శకులకు మరో అవకాశం కల్పించేందుకు నవంబర్ 1వ తేదీ సాయంత్రం వరకు మేళాను కొనసాగిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ కోరారు.

ఎన్టీఆర్ జిల్లాలో ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ: పెన్ పవర్, అక్టోబర్, 31,

ఎన్టీఆర్ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా,స్వేచ్ఛగా,నిష్పక్షపాతంగానిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.

విజయవాడ కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలోశనివారంవివిధరాజకీయపార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయకుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ కేంద్రాల వద్ద పాటించాల్సిన నిబంధనలు, అభ్యర్థుల ఎన్నికలవ్యయపర్యవేక్షణపైఅవగాహనకల్పించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కు విలువను గుర్తించి బాధ్యతగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో టెంట్లు ఏర్పాటు చేయరాదని, 100 మీటర్ల పరిధిలో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఓటరు స్లిప్పులపై పార్టీ గుర్తులు ఉండరాదని, అభ్యర్థులు ప్రిసైడింగ్ అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డును ధరించి మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని తెలిపారు. పార్టీ కండువాలతో పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లరాదని సూచించారు.పోలింగ్ సిబ్బందికి విధుల నిర్వహణలో ఆటంకం కలిగించినా, గందరగోళం సృష్టించినా,ఎన్నికలనిబంధనలుఉల్లంఘించినాచట్టప్రకారంకఠినచర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

మరోవైపు,అభ్యర్థులఎన్నికలవ్యయాన్ని పర్యవేక్షించేందుకు షాడోరిజిస్టర్‌నిర్వహిస్తున్నట్లుఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయకుమార్ తెలిపారు. ఎన్నికల వ్యయానికి సంబంధించి నిర్దేశించిన నిబంధనలను అభ్యర్థులందరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత బలోపేతం చేయాలి మంజుల పత్తిపాటి.

విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 31,

పత్రికల వారితో మాట్లాడుతూ మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌మంజులపత్తిపాటిమాట్లాడుతూ.. రైతు దేశానికి వెన్నెముక అని, రైతు పండించిన పంటకు సరైన ధర లభించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని అన్నారు. రైతుల మార్కెటింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, మార్కెటింగ్ సంస్థలు, రైతు సంఘాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనేక వ్యవసాయ మార్కెట్ కమిటీలు పరిపాలనా, ఆర్థిక, మౌలిక సదుపాయాల పరంగా వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడం ద్వారా వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రభుత్వ సహకారంతో తగిన నిధులు కేటాయించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రైతుల భాగస్వామ్యంతో మార్కెట్ కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. తద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని మంజుల పత్తిపాటి అభిప్రాయపడ్డారు.

ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ: పెన్ పవర్,అక్టోబర్ 31,

జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు సాధారణ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1, 2026 (ఆదివారం)న ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.1316 (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ)తో పాటు కార్మిక శాఖ సవరించిన ఆదేశాల మేరకు ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం,1988 నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని అన్ని దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు తప్పనిసరిగా కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను అన్ని యాజమాన్యాలు కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఓటర్లందరూ తమ

ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు.

బంగారుపాలెం మండలం లో ఇందిరమ్మ కాలనీలో ఎన్నికల ప్రచారం

పెన్ పవర్, అక్టోబర్, 31,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తగ్గువారి పల్లె బి2 ఎంపిటిసి అభ్యర్థి కిరణ్ కుమార్ ని భారీ మెజారిటీతో గెలిపించాలనిఈ రోజు ఇందిరమ్మ కాలని లోమండల పార్టీ కన్వీనర్ పాలేరు రామచంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి మరియు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.బి. కుమార్ రాజా, మాజీ వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి, ఆర్.టి.ఐ రాష్ట్ర అధ్యక్షులు జన్నావుల సురేంద్ర, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఖాదర్, జిల్లా మాజీ యువజన విభాగం ఉపాధ్యక్షులు మహేంద్ర, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి రఘు, మండల యువత అధ్యక్షుడు గజేంద్ర,మండల మైనారిటీ అధ్యక్షులు షాకీర్, స్థానిక నాయకులు ముబారక్, కార్తిక్, మాజీ సర్పంచ్ భారతి,తదితర నాయకులు పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

యలహంక ప్రాపర్టీ వంద శాతం నాదే.. షర్మిల ట్వీట్, అన్న జగన్ రెడ్డికి కౌంటర్

బెంగుళూరులోని యలహంక ప్రాపర్టీ వంద శాతం వాటాగా వచ్చినట్లు పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అప్పటివరకు ఉమ్మడి ఆస్తిగా ఉన్న యలహంక ఇల్లు ఆస్తుల పంపకాల్లో నాకు, నా పిల్లలకు వచ్చిందని చెబుతూ షర్మిల ఎక్స్ లో పోస్టు పెట్టారు. యలహంక నివాసంలో షర్మిల కుమార్తె అంజలిరెడ్డి వివాహం చేయాలని నిర్ణయించగా, ఆమె సోదరుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సెక్యూరిటీ కారణాలు చూపుతూ అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇద్దరి మధ్య ఆస్తుల వివాదం హాట్ టాపిక్ గా మారింది. యలహంకలో అంజలిరెడ్డి వివాహానికి జగన్ అడ్డు చెబుతున్నారని వార్తలు వచ్చిన నుంచి పెద్ద రాజకీయ దుమారమే నడుస్తోంది. దీనిపై ఇంతవరకు బహిరంగంగా మాట్లాడని షర్మిల ఎక్స్ ద్వారా తొలిసారిగా స్పందించారు.

అంత నీచత్వం లేదు

తన కుమార్తె వివాహంపై సోదరుడు వైఖరి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన షర్మిల.. ట్విట్టర్ లో చేసిన ట్వీట్ లో అనేక అంశాలను ప్రస్తావించారు. "నాది కానీ దానికోసం ఆశపడే నీచత్వం నాది కాదు." అంటూ షర్మిల ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేవుడి సాక్షిగా నిజం చెబుతున్నా యలహంక ప్యాలెస్ తనదేనని షర్మిల స్పష్టం చేశారు. నాన్న వైఎస్సార్ స్వయంగా తిరిగిన ఇల్లు కావడమే కాకుండా, తాను పెరిగిన ఇల్లే తన పెళ్లి వేదిక కావాలని కుమార్తె అంజలి రెడ్డి ఆశించినట్లు షర్మిల పేర్కొన్నారు. "మన తెలుగింట ఏ గుమ్మాన్ని అడిగినా చెప్తుంది.. సొంత ఇంట్లో బిడ్డ పెళ్లి చేయడం ప్రతి తల్లిదండ్రులకు అదృష్టమని. కానీ, తాను పెరిగిన ఇల్లే పెళ్లి వేదిక కావాలన్న నా బిడ్డ ఆకాంక్షను నెరవేర్చలేక పోయామని చాలా బాధపడుతున్నా" అంటూ షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

వివాదాల్లేకుండా పెళ్లి జరిపించడమే మా బాధ్యత

వివాహ వేదిక వివాదంపై స్పందించిన ప్రతి ఒక్కరికీ షర్మిల కృతజ్ఞతలు తెలిపారు. "నా కుమార్తె అంజిలి పెళ్లి.. పెద్దలు కుదిర్చిన సంబంధం. వివాద రహితంగా, ఎలాంటి గొడవలు లేకుండా, వివాహం జరిపించాల్సిన బాధ్యత మా మీద ఉంది. అందుకే వైఎస్ అంజిలి రెడ్డి – సోమల రఘురామ్ రెడ్డిల పరిణయ వేడుకను యలహంక ఇంట్లో కాకుండా, వేరే ప్రదేశంలో బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో నిర్వహించాలని నిశ్చయించుకున్నాం" అని తెలిపారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో వేదిక మార్పు తప్పలేదని సూచిస్తూ, కాబోయే నవ దంపతులకు తెలుగు ప్రజల ఆశీస్సులు, దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని వైఎస్ షర్మిల మనసారా ఆకాంక్షించారు. కాగా, షర్మిల ట్వీట్ అంజలిరెడ్డి వివాహం వేదిక మార్పుపై స్పష్టత వచ్చిందని అంటున్నారు. ఇదే సమయంలో బెంగళూరు ఇల్లు తనది అంటూ షర్మిల చెప్పడంతో సోదరుడు జగన్ రెడ్డి వాదనను వ్యతిరేకిస్తున్నట్లు సంకేతాలిచ్చారని అంటున్నారు.

బెంగళూరు ఇల్లు తనది అంటూ జగన్ రెడ్డి లేఖ రాసిన నేపథ్యంలో ఆ ఇల్లు తనది అంటూ షర్మిల కూడా వాదిస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. దీంతో అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం మరింత ముదిరినట్లుగా భావిస్తున్నారు. మరోవైపు ఈ కుటుంబ వివాదం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. మొత్తానికి జగన్ రెడ్డి వైఖరి కారణంగా షర్మిల తన కుమార్తె వివాహ వేదికను మార్చుకోవాల్సివచ్చిందని వ్యాఖ్యానిస్తున్నారు.

మిథున్ రెడ్డికి అరెస్టు ముప్పు.. హైకోర్టులో నిరాశ, పుంగనూరు కేసులో బిగ్ ట్విస్ట్

రాజంపేట వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి అరెస్టు ముప్పు పొంచివుంది. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారించిన హైకోర్టు అరెస్టును ఆపలేమని తేల్చిచెప్పింది. దీంతో ఎంపీ మిథున్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని అంటున్నారు. పుంగనూరు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసుల్లో ఆయనకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు న్యాయస్థానం స్పష్టంగా నిరాకరించింది. అయితే, తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ ఎంపీ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై విచారణను డిసెంబరు 28వ తేదీకి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఆదేశాలు జారీ చేశారు.

పుంగనూరు మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి వెళ్తున్న టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడటం, ప్రైవేటు బౌన్సర్‌తో వాహనాన్ని కార్యకర్తలపైకి తోలించడం వంటి తీవ్రమైన ఆరోపణలపై పుంగనూరు టౌన్ పోలీసులు ఈ నెల 16న ఎంపీ మిథున్‌రెడ్డిపై కేసులు నమోదు చేశారు. మదనపల్లె డీఎస్పీతో పాటు మధుసూదన్ రాయల్, జంపల మోహన్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నమోదైన మొత్తం నాలుగు కేసులను కొట్టివేయాలని కోరుతూ ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఒకే ఘటనపై వేర్వేరుగా నాలుగు కేసులు నమోదు చేయడం చెల్లుబాటు కాదని, కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఈ కేసులు బనాయించారని పేర్కొన్నారు. హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు పిటిషనర్‌కు వర్తించవని, విచారణ పూర్తయ్యే వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును కోరారు. మరోవైపు ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ ఈ వాదనలను తీవ్రంగా ఖండించారు. పిటిషనర్ పుంగనూరును తన అడ్డాగా భావించి, నామినేషన్ కేంద్రం వద్ద అలజడి సృష్టించే ముందస్తు పథకంతోనే భారీ కాన్వాయ్, అనుచరులతో వచ్చారని తెలిపారు. బౌన్సర్‌ను రెచ్చగొట్టి కారును అక్కడ ఉన్న టీడీపీ కార్యకర్తలపైకి నడిపించారని, ఈ దాడుల్లో 30 మందికి పైగా గాయపడ్డారని వివరించారు. ఎంపీపై తీవ్రమైన హత్యాయత్నం కేసులు ఉన్నాయని, దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని తెలిపారు. క్వాష్ పిటిషన్లలో అరెస్టు రక్షణ కోరడానికి వీల్లేదని, రక్షణ కావాలనుకుంటే ముందస్తు బెయిల్ పిటిషన్ ద్వారా చట్టపరమైన మార్గాలను చూసుకోవాలని పీపీ స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులు మధుసూదన్ రాయల్, జంపల మోహన్ నాయుడు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది పీవీజీ ఉమేశ్ చంద్ర కూడా కోర్టులో వాదనలు వినిపించారు. నామినేషన్ల కేంద్రం వద్దకు వెళ్లడానికి పిటిషనర్ పోటీ చేస్తున్న అభ్యర్థి కాదు, లేదా కనీసం అభ్యర్థిని బలపరిచే వ్యక్తి కూడా కాదని, అలాంటప్పుడు అంత మందితో నామినేషన్ కేంద్రం వద్దకు వెళ్లడంలోనే ఆయన దురుద్దేశం స్పష్టమవుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మిథున్‌రెడ్డి నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నందున క్వాష్ పిటిషన్‌లో అరెస్టుపై రక్షణ ఇవ్వకూడదని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఎంపీకి ఎలాంటి మధ్యంతర రక్షణ ఇవ్వడానికి నిరాకరిస్తూ విచారణను డిసెంబరు 28కి వాయిదా వేసింది. ఈ పరిణామంతో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మరోసారి అరెస్టు అయ్యే అవకాశాలు ఉన్నాయని న్యాయవాద వర్గాలు భావిస్తున్నాయి. అయితే హైకోర్టు నిర్ణయాన్ని మిథున్ రెడ్డి సుప్రీంలో సవాల్ చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. దీంతో పోలీసులు అంతవరకు వేచిచూస్తారా? లేక వెంటనే అరెస్టుకు సిద్ధమవుతారా అనేది చూడాల్సివుందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు పోలీసులు నిర్ణయం ఉండొచ్చని అంటున్నారు. స్థానిక ఎన్నికల వేళ ఈ పరిణామం విపక్షం వైసీపీని ఆందోళనకు గురిచేస్తోంది. పుంగనూరు మున్సిపాలిటీ ఏకగ్రీవం అయింది. అయితే 5వ తేదీన జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలు ఉండటంతో ఎంపీ మిథున్ రెడ్డిను అరెస్టు చేసే అంశమై తర్జనభర్జన జరుగుతోందని అంటున్నారు.

సొంత ఊర్లో జగన్ కు బిగ్ సవాల్.. పులివెందుల గెలవక తప్పని పరిస్థితి

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో విషమ పరిస్థితి ఎదుర్కొంటున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నడూ లేనట్లుగా పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ ఏకగ్రీవాలు చేసుకోవడాన్ని మాజీ సీఎం జగన్ రెడ్డి జీర్ణించుకోలేక పోతున్నారు. తన అడ్డాలో టీడీపీ జెండా పట్టుకున్న వారే లేరనుకున్న ధీమాలో జగన్ రెడ్డి ఉండేవారని చెబుతున్నారు. అయితే ఏకంగా 20 వార్డులు ఏకగ్రీవం చేసుకునే స్థాయికి టీడీపీ చేరుకుంటుందని జగన్ రెడ్డి ఎప్పుడూ ఊహించలేదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో పులివెందుల చైర్ పర్సన్ గా బరిలోకి దిగిన తన సొంత పిన్ని వైఎస్ ప్రమీలమ్మను గెలిపించాల్సిన బాధ్యత జగన్ రెడ్డి భుజస్కందాలపై పడిందని అంటున్నారు. దీంతోనే మున్సిపల్ ఎన్నికల రోజు జగన్ స్వయంగా రంగంలోకి దిగుతున్నారని చెబుతున్నారు.



పులివెందుల నియోజకవర్గం వైఎస్ కుటుంబం కంచుకోటగా చెబుతున్నారు. గత 40 ఏళ్లుగా వైఎస్ కుటుంబం చెప్పిన వారే స్థానిక సంస్థలలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతూ వస్తున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పులివెందుల నియోజకవర్గంలో మాత్రం వైఎస్ కుటుంబం పెత్తనమే నడిచేదని అంటున్నారు. అటువంటిది తొలిసారిగా వైఎస్ కుటుంబం జీర్ణించుకోలేని స్థితిలో టీడీపీ ఏకగ్రీవాలు చేసుకోవడమే రాజకీయ వర్గాలను ఆకర్షిస్తోందని చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల వరకు పులివెందులలో తనకు ఎదురే లేదన్నట్లు భావించిన మాజీ సీఎం జగన్ రెడ్డికి రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత సొంత నియోజకవర్గంలోనూ సవాళ్లు ఎదురుకావడమే హాట్ టాపిక్ అవుతోందని అంటున్నారు. నిజానికి పులివెందుల రాజకీయాల్లో జగన్ రెడ్డి ఎప్పుడూ నేరుగా జోక్యం చేసుకోలేదని చెబుతున్నారు. తన కుటుంబ సభ్యులు అయిన కడప ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డి, ప్రస్తుత మున్సిపల్ చైర్ పర్సన్ గా పోటీ చేస్తున్న వైఎస్ ప్రమీలమ్మ భర్త మనోహరరెడ్డి మాత్రమే స్థానిక రాజకీయం చూసుకునే వారంటున్నారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం తన సొంత ఇలాకాలో పాతుకుపోయేలా చేస్తున్న ప్రయత్నాలతో జగన్ రెడ్డి ఆందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. భాస్కర్ రెడ్డి పులివెందులలో లేకపోవడం, అవినాశ్ రెడ్డి, మనోహర్ రెడ్డిని పోలీసుల సాయంతో అడ్డుకునేలా టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్న కారణంగా తానే నేరుగా రంగంలోకి దిగాలని జగన్ రెడ్డి భావించారని అంటున్నారు.

ఇప్పటికే ఒకసారి పులివెందుల వెళ్లి వచ్చిన ఆయన ఆదివారం జరిగే పోలింగ్ కు వస్తానని, ఓటు వేస్తానని చేసిన ప్రకటన పులివెందుల వైసీపీ కేడర్ లో ధైర్యం నింపిందని అంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి స్థానికంగా ఉంటే తమ కేడర్ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు వీలు ఉంటుందని, లేదంటే వైసీపీ సానుభూతిపరులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతాయని వైసీపీ నేతలు భయపడుతున్నారని చెబుతున్నారు. దీంతో జగన్ రెడ్డి రాకతో పులివెందుల పోలింగ్ శాతం పెరుగుతుందని, ఇది తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. నిజానికి పులివెందుల మున్సిపల్ చైర్మన్ పీఠం గెలవడం పార్టీ కన్నా మాజీ సీఎం జగన్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్టే ముఖ్యం అంటున్నారు. సొంత నియోజకవర్గంలో సొంత కుటుంబ సభ్యులను గెలిపించుకోలేని పరిస్థితులు ఉంటే జగన్ రాజకీయ భవిష్యత్తుకు కూడా పెను ప్రమాదమన్న సంకేతాలుగానే భావించాల్సివుందని అంటున్నారు. దీంతో పులివెందుల గెలుపు కోసం జగన్ రెడ్డి ఎటువంటి ప్రయత్నాలు చేస్తారనే ఉత్కంఠ ఎక్కువ అవుతోందని అంటున్నారు.

ఇరు పార్టీలదీ 'సేవ్ విశాఖ' ప్రచారమే.. !

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. 120 వార్డుల్లో అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్పొరేటర్ ఎన్నికల పోలింగ్ నవంబర్ 1న జరగనుండగా, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అయితే.. ఈ ఎన్నికల్లో అటు టీడీపీ, ఇటు వైసీపీలు ఒకే నినాదంతో బరిలోకి దిగడం విశేషం. సేవ్ విశాఖ పేరుతో టీడీపీ, వైసీపీ నేతలు ప్రజలను కలుస్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని టీడీపీ నేతలు.. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం పై వైసీపీ నేతలు విమర్శలు సంధిస్తున్నారు.విశాఖలో విలువైన భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారంటూ 'సేవ్ విశాఖ' పోస్టర్‌ను విడుదల చేసి వైసీపీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసీపీ మేయర్ అభ్యర్థిగా వరుదు కళ్యాణి బరిలో ఉన్న నేపథ్యంలో ఆమె దీనిని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. వైఎస్సార్సీపీ తరపున కేకే రాజు, కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ తదితరులు వివిధ వార్డుల్లో పర్యటిస్తున్నారు. మరోవైపు, టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి తరపున ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజు వంటి నేతలు తమ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగ్స్ నిర్వహిస్తున్నారు.ఇరు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికల్లో ప్రచార సరళి ఉధృతంగానే ఉందని చెప్పాలి. వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విస్తృతంగా పర్యటిస్తూ దూకుడుగా ప్రచారం నిర్వహించారు. విశాఖలోని విలువైన ప్రభుత్వ భూములను, ప్రభుత్వ ఆస్తులను కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపిస్తూ వైసీపీ 'సేవ్ వైజాగ్' (విశాఖను కాపాడుకుందాం) అనే నినాదంతో ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.ఇక, ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై విమర్శలు గుప్పిస్తున్నారు. "కిలో బియ్యం రూ.100, ఎకరా పొలం మాత్రం 99 పైసలు" అంటూ వినూత్నంగా విమర్శలు చేశారు. అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించడం, ఓ వర్సిటీకి సంబంధించిన భూముల వివాదాన్ని లేవనెత్తడం, మత్స్యకార నివాసాలు, నిరుద్యోగ భృతి, మహిళా పెన్షన్లపై ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. కూటమి తరపున టీడీపీ మాజీ కార్పొరేటర్ ముక్కా శ్రావణిని మేయర్ అభ్యర్థిగా బరిలోకి దించి గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు. 'చెప్పాం.. చేస్తున్నాం' మంత్రంతోపాటు వైసీపీ నేతల నుంచి సేవ్ విశాఖ అనే పేరుతో ప్రచారం చేస్తున్నారు. అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం తాము ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే విధానాన్ని నమ్ముకుంది. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో నగర సమగ్ర అభివృద్ధిని తమ ప్రచార అస్త్రంగా మార్చుకుంది.మొత్తం 120 వార్డులలో కూటమి సీట్ల సర్దుబాటు ప్రకారం టీడీపీ 77, జనసేన 32, బీజేపీ 11 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. స్థానిక జనసేన, బీజేపీ శ్రేణులను కలుపుకుని ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసి ప్రచారం నిర్వహించారు. విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ విస్తృతంగా సోషల్ మీడియా ప్రచారాన్ని చేపట్టగా, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, గంటా శ్రీనివాసరావు వంటి సీనియర్ ఎమ్మెల్యేలు స్వయంగా వార్డుల్లో పర్యటించి అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

బెజవాడలో త్రిముఖ పోరు

విజయవాడ, అక్టోబరు 31, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కేంద్రబిందువైన విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. అధికార ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలోనిలవగా, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ తరపున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరోసారి పోటీ పడుతున్నారు. అయితే, ఈ ద్విముఖ పోరును అనూహ్యంగా త్రిముఖ సమరంగా మారుస్తూ మాజీఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగానికి దిగడం బెజవాడ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. వామపక్షాలు , కాంగ్రెస్ పార్టీల ఐక్య మద్దతుతో ఆయననిర్వహిస్తున్న ప్రచారం సాంప్రదాయ రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.మాజీ సీపీగా బెజవాడ నగరంపై పరిపూర్ణమైన పట్టు, శాంతిభద్రతలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏబీ వెంకటేశ్వరరావుతన ప్రచారాన్ని ప్రత్యేక శైలిలో నిర్వహిస్తున్నారు. అవినీతి రహిత నగర పాలన, పన్నుల భారం తగ్గించడం, లంచాలు లేని సేవలు అనే నినాదాలతో మేధావులు, మధ్యతరగతి , విద్యాధికుల ఓటు బ్యాంక్‌నుఆకర్షించేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. వామపక్ష బలానికి తోడు కాంగ్రెస్ పార్టీ మద్దతు లభించడం, అలాగే సీనియర్ ఐపీఎస్‌గా ఆయనకున్న నిష్కళంకమైన ఇమేజ్ ఏబీవీకి ప్రధాన బలంగామారాయి. ఏ రాజకీయ పార్టీ బంధాలు లేకుండా, కేవలం విజయవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆయన విసురుతున్న సవాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడుపడటం లేదు.అయితే, ఎన్డీయే కూటమిఅభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధాకృష్ణకు బలమైన ప్రజాదరణ, వంగవీటి కుటుంబానికి నగరంలో ఉన్న అభిమానుల బలగం పెద్ద ప్లస్ పాయింట్. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధికార్యక్రమాలు తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. రాధాకృష్ణ, ఏబీ వెంకటేశ్వరరావు ఇద్దరూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా అత్యంతహుందాతనంతో ప్రచారం సాగిస్తుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. రాధా సైతం నగరాభివృద్ధికి ఏబీవీ సలహాలు తీసుకుంటా అని ప్రకటించగా, ఏబీవీ కూడా మాది భావజాల పోరాటమే తప్పవ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు.మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి బిసి సామాజిక వర్గ సమీకరణాలు, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులనే నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు.అయితే, ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందనేది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. నాన్-పొలిటికల్, న్యూట్రల్ ఓటర్లు, మార్పు కోరుకునే వర్గాలు గనక ఏబీవీ వైపు మొగ్గుపడితే కూటమి, వైసీపీ ఓట్ బ్యాంకుల్లో
భారీగా గండిపడే అవకాశం ఉంది. బెజవాడ ఓటర్లు ఎప్పుడూ ఊహించని సంచలన తీర్పులకు వేదికగా నిలుస్తారనే చరిత్ర ఉండటంతో, ఏబీవీ గెలుపు అవకాశాలను రాజకీయ విశ్లేషకులుతోసిపుచ్చలేకపోతున్నారు. వంగవీటి రాధా పవర్ కేడర్, రాయన భాగ్యలక్ష్మి పార్టీ క్యాడర్ బలానికి ఎదురీదుతూ ఏబీ వెంకటేశ్వరరావు సృష్టిస్తున్న ఈ ట్రెండ్ బెజవాడ రాజకీయాల్లో కొత్త చరిత్రకు పునాదివేస్తోంది. సంప్రదాయ పార్టీల ధనప్రవాహం, కుల సమీకరణలను దాటుకుని, వామపక్షాల సంపూర్ణ సహకారంతో ఏబీవీ నిజంగానే బెజవాడ పీఠంపై సంచలనం సృష్టిస్తారా లేక కూటమి-వైసీపీల హోరాహోరీ
మధ్య స్వతంత్ర హోదాకే పరిమితమవుతారా అనేది పోలింగ్ ఫలితాలు తేల్చనున్నాయి.

వన్డేల్లో జడేజా కెరీర్ ఎండ్.. అక్షర్ మెయిన్ ఆల్‌రౌండర్.. పుజారా కామెంట్స్ వైరల్!

భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా భవిష్యత్తుపై మరోసారి తీవ్రమైన చర్చ మొదలైంది. న్యూజిలాండ్‌తో నవంబర్ 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత జట్టులో జడేజాకు చోటు దక్కకపోవడం, అతని స్థానంలో అక్షర్ పటేల్‌కే మేనేజ్‌మెంట్ ప్రాధాన్యం ఇవ్వడంపై టీమిండియా మాజీ క్రికెటర్ ఛేతేశ్వర్ పుజారా కీలక వ్యాఖ్యలు చేశాడు. జడేజా వన్డే కెరీర్ దాదాపు ముగిసిపోయిందని, వచ్చే ఏడాది జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్‌లో అక్షర్ నే ప్రధాన ఆల్‌రౌండర్‌గా బోర్డు భావిస్తోందని పుజారా విశ్లేషించాడు.

టెస్టులకే పరిమితం కాలేదు: ఛేతేశ్వర్ పుజారా

జియోస్టార్ చర్చా కార్యక్రమంలో పుజారా మాట్లాడుతూ.. రవీంద్ర జడేజా ఎంపికపై తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు తెలిపాడు. ఒకవేళ జడ్డూని వన్డేల్లో కొనసాగించాలనుకుంటే.. ఈ న్యూజిలాండ్ సిరీస్‌కే ఎంపిక చేసేవారు. అక్షర్ పటేల్ వన్డేల్లో ప్రధాన ఆల్‌రౌండర్‌గా స్థిరపడ్డాడు కాబట్టి, జడేజాకు మేనేజ్‌మెంట్ ఇప్పటికే విషయాన్ని స్పష్టం చేసి ఉంటుంది. వయసు రీత్యా ఆయనను ఇకపై కేవలం టెస్టు క్రికెట్‌కే పరిమితం కావాలని, వైట్ బాల్ క్రికెట్ (వన్డేలు, టీ20లు)లో ఛాన్స్ ఇచ్చే పరిస్థితి లేదని చెప్పి ఉంటారు.. ఇప్పటికే టీ20లకి రెస్ట్ తీసుకున్నాడు కాబట్టి, వన్డే కెరీర్‌కు కూడా ఇది ఎండ్ కార్డే అని పుజారా పేర్కొన్నాడు.

ఆపద్బాంధవుడిగా జడేజానే బ్యాకప్: అభిషేక్ నాయర్

అయితే టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్ మాత్రం పుజారా అభిప్రాయంతో పూర్తి స్థాయిలో ఏకీభవించలేదు. జడేజాను ఒక ఇన్సూరెన్స్ పాలసీలా మేనేజ్‌మెంట్ ఉంచుకుంటుందని అభిప్రాయపడ్డాడు. ద

జడేజా రెగ్యులర్ స్క్వాడ్‌లో లేకపోవచ్చు.. కానీ వన్డే ప్రపంచకప్‌కు ముందు అక్షర్ పటేల్‌కు ఏమైనా గాయమైతే.. మేనేజ్‌మెంట్ మైండ్‌లోకి వచ్చే మొదటి పేరు జడేజానే.. అక్షర్ తర్వాత టీమిండియాకు అంతటి నమ్మకమైన స్పిన్ ఆల్‌రౌండర్ వేరే ఎవరూ లేరు.. కాబట్టి జడేజా ఒక పర్ఫెక్ట్ 'ఇన్సూరెన్స్ పాలసీ'లా అందుబాటులో ఉంటాడని నాయర్ తెలిపాడు. వన్డేల్లో 200లకు పైగా వికెట్లు, 2,700 పైచిలుకు పరుగులు చేసిన 37 ఏళ్ల రవీంద్ర జడేజాను భారత్ మేనేజ్‌మెంట్ పక్కనబెట్టి, అక్షర్ పటేల్‌ను పూర్తిస్థాయిలో ప్రోత్సహించడంపై క్రికెట్ అభిమానుల్లో ఇప్పుడు మిశ్రమ స్పందన వ్యక్తం అవుతోంది.

విండీస్ చేతిలో బంగ్లాదేశ్ ఓటమి.. భారత్ కు అలా కలిసొచ్చింది!

బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. ఈ ఫలితం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) పాయింట్ల పట్టికలో టీమిండియాకు అనూహ్యంగా కలిసొచ్చింది. బంగ్లాదేశ్ ఓటమితో భారత్ ఐదో స్థానం నుంచి నాలుగో స్థానానికి ఎగబాకింది. ఢాకా సమీపంలోని షేర్-ఏ-బంగ్లా స్టేడియంలో శనివారం ముగిసిన ఈ టెస్టులో, నాలుగో రోజు వెస్టిండీస్ 170 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ అజేయంగా 81 పరుగులు చేయగా, కావెమ్ హాడ్జ్ 31 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో విండీస్ జట్టు కేవలం 35.1 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌కు ముందు, బంగ్లాదేశ్ 55.56% పాయింట్లతో నాలుగో స్థానంలో, భారత్ 51.52% పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగాయి. తాజా ఓటమితో బంగ్లాదేశ్ పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (ఁజు) 47.62%కి పడిపోయింది. దీంతో వారు భారత్ కంటే కిందకు, అంటే ఐదో స్థానానికి చేరారు. ఫలితంగా టీమిండియా ఎలాంటి మ్యాచ్ ఆడకుండానే నాలుగో స్థానానికి ఎగబాకింది. మరోవైపు, ఈ విజయంతో వెస్టిండీస్ పీసీటీ 20.83% నుంచి 26.92%కి పెరిగింది. ప్రస్తుతం 8వ స్థానంలో ఉన్నప్పటికీ, ఏడో స్థానంలో ఉన్న శ్రీలంక (33.33%)కు మరింత చేరువైంది. విజయం అనంతరం విండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ మాట్లాడుతూ.. "ర్యాంకింగ్స్‌లో పైకి వెళ్లే లక్ష్యంతోనే ఇక్కడికి వచ్చాం. ఈ రెండు టెస్టులు గెలిచి పట్టికలో కనీసం ఐదు లేదా ఆరో స్థానంలో నిలవాలనుకుంటున్నాం" అని తమ లక్ష్యాన్ని స్పష్టం చేశాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 272 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ షాద్మాన్ ఇస్లాం (105) సెంచరీతో ఆకట్టుకున్నాడు. విండీస్ బౌలర్ జోమెల్ వారికన్ ఐదు వికెట్లతో రాణించాడు. అనంతరం విండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ కేవలం 142 పరుగులకే కుప్పకూలింది. రోస్టన్ ఛేజ్ 5 వికెట్లు, వారికన్ 4 వికెట్లు పడగొట్టి బంగ్లా పతనాన్ని శాసించారు. స్వల్ప లక్ష్యాన్ని విండీస్ బ్యాటర్లు సులభంగా ఛేదించారు.

ఐదో టీ20కి దినేశ్ కార్తీక్ కొత్త ప్లాన్.. సంజూ, వైభవ్ ఇద్దరికీ చోటు!

న్యూజిలాండ్‌తో ఐదో టీ20లో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పించేందుకు సంజూ శాంసన్‌ను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ సూచించాడు. వైభవ్‌ను ఆడించాలనుకుంటే అభిషేక్ శర్మకు విశ్రాంతినివ్వాలని అభిప్రాయపడ్డాడు. సిరీస్‌ను భారత్ ఇప్పటికే కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ జట్టులో మార్పులు చేయవచ్చని పేర్కొన్నాడు. క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ కార్తీక్ ఈ సూచన చేశాడు. "వైభవ్ ఆడాలని అందరూ కోరుకుంటున్నారు. అతడికి అవకాశం ఇవ్వాలంటే అభిషేక్‌కు విశ్రాంతి ఇవ్వాలి. వైభవ్ గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ సంజూనే ఎందుకు తప్పించాలి? అభిషేక్‌కు కూడా విశ్రాంతి ఇవ్వొచ్చు. ఇక్కడ కీలకమైన విషయం విశ్రాంతి మాత్రమే" అని కార్తీక్ అన్నాడు. బౌలింగ్ విభాగంలోనూ మార్పులు చేయాలని కార్తీక్ సూచించాడు. అక్షర్ పటేల్‌ను కొనసాగిస్తూ అర్ష్‌దీప్ సింగ్‌కు విశ్రాంతినివ్వవచ్చని చెప్పాడు. అతడి స్థానంలో మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్‌లకు అవకాశం కల్పించవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌లో అర్ష్‌దీప్ అద్భుతంగా బౌలింగ్ చేశారని, పరిస్థితులను బట్టి అదనపు స్పిన్నర్‌ను పరీక్షించవచ్చని పేర్కొన్నాడు. గాయంతో ఇషాన్ కిషన్ రెండు, మూడో టీ20లకు దూరం కావడంతో వైభవ్‌కు జట్టులో చోటు దక్కింది. మూడో మ్యాచ్‌లో 19 బంతుల్లో 45 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కోలుకుని తిరిగి రావడంతో నాలుగో టీ20లో వైభవ్‌కు అవకాశం దక్కలేదు. ఐదో టీ20 నవంబర్ 1న హామిల్టన్‌లో జరగనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3-1తో ఆధిక్యంలో ఉంది.

యశ్ పిల్లలకు తొలి సినిమా అనుభూతి.. అది కూడా రామాయణంతోనే!

రాకింగ్ స్టార్ యశ్ కుటుంబానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. యశ్, రాధికా పండిట్ పిల్లలు అయ్రా, యథర్వ్ తమ జీవితంలో తొలిసారి సినిమా చూశారు. విశేషం ఏమిటంటే.. వారి మొదటి సినిమా అనుభవం సాధారణ చిత్రంతో కాకుండా, భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రంతో మొదలైంది. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న రామాయణం సినిమా లాస్ ఏంజెల్స్‌లో జరిగిన ప్రత్యేక ప్రీమియర్‌లో ఈ పిల్లలు సినిమాను వీక్షించినట్లు సమాచారం. అక్టోబర్ 30న యథర్వ్ ఏడో పుట్టినరోజు సందర్భంగా ఈ విషయం మరింత ప్రత్యేకంగా మారింది. అయితే పిల్లలు సినిమా చూసినప్పుడు ఎలా స్పందించారు అనే వివరాలను కుటుంబం బయటకు వెల్లడించలేదు.

ఈ సినిమాలో యశ్ రావణుడి పాత్రలో కనిపించనున్నారు. అంతేకాదు, తన సొంత నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ ద్వారా ఈ ప్రాజెక్టులో సహ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. అందుకే ఈ సినిమా యశ్ కెరీర్‌లోనే కాకుండా ఆయన కుటుంబానికి కూడా ప్రత్యేకమైన జ్ఞాపకంగా నిలిచే అవకాశం ఉంది. పిల్లల పేర్ల వెనుక కూడా ఆసక్తికరమైన అర్థాలు ఉన్నాయి. అయ్రా అనే పేరు ఐరావతి నుంచి ప్రేరణ పొందింది. ఇది లక్ష్మీదేవికి సంబంధించిన మరో పేరుగా చెబుతారు. ఇక యథర్వ్ అంటే సంపూర్ణమైనది అనే అర్థం. యశ్, రాధికా, అయ్రా పేర్లలోని అంశాలను కలిపి యథర్వ్ పేరును రూపొందించినట్లు గతంలో ఈ దంపతులు వెల్లడించారు. ఒక తండ్రి తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పాత్రలో నటిస్తున్న సినిమా.. అదే తన పిల్లలకు తొలి సినిమా కావడం నిజంగా ప్రత్యేకమైన విషయం. తరతరాలుగా భారతీయులకు పరిచయమైన రామాయణం ఇప్పుడు ఒక కొత్త తరానికి సినిమా రూపంలో పరిచయం కాబోతోంది.

స్టైలిష్ బ్లూ బ్లేజర్ దుస్తుల్లో ఆకట్టుకుంటున్న ప్రజ్ఞా నయన్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965